
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 25.09.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## బీజేపీ 'మెగా' వ్యూహం?

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతోంది. రాజధాని అంటూ రైతుల భూములను లాక్కుంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్, బందరు పోర్టు, భావనపాడు సెజ్... అంటూ రైతుల భూములను కాజేస్తోంది. పట్టిసీమ వంటి స్వప్రయోజన ప్రాజెక్ట్‌లను పెట్టుకుంది... ఇవన్నీ కూడా ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకతను పెంచేవే. రాష్ట్రంలో తెలుగుదేశానికి బీజేపీ మిత్ర పక్షం. ప్రభుత్వం తప్పులు చేస్తున్నప్పుడు మిత్రపక్షమైనప్పటికీ విమర్శలు చేయక తప్పదు.

కానీ, రాష్ట్రంలో బీజేపీ ఆ పని చేయడం లేదు. అధికారపార్టీ అవినీతి కార్యకలాపాలపై వేలెత్తి చూపడం లేదు, సరికదా పట్టిసీమ వంటి అవినీతి ప్రాజెక్ట్‌లను సమర్ధిస్తూ మాట్లాడుతున్నారు. దీనికి కారణం చంద్రబాబును వెనకేసుకు

(మిగతా 11వ పేజీలో)



## నవ్వులపాలైన నదుల అనుసంధానం

- హడావిడి పనులు... పనుల కంటే పబ్లిసిటీపై ఆసక్తి...
- ఆర్భాటపు ప్రారంభోత్సవాలు... అనవసర ఆనందోత్సాహాలు...

*పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో దేశవ్యాప్తంగా ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించారు. భావితరాలకు శాశ్వత ప్రయోజనాలందించే విధంగా వాటి నిర్మాణం జరిగింది. ఎన్టీఆర్ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు గంగ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. దాని ఫలితం నిన్న అనుభవించారు, నేడు అనుభవిస్తున్నారు. రేపటి తరాల వారు కూడా అనుభవిస్తారు. వాజ్‌పేయి దేశ ప్రధానిగా వుండగా నాలుగులైన్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. చరిత్ర వున్నంతవరకు ఆ రహదారుల మీద ఆయన పేరు కనిపిస్తూనే వుంటుంది. వై.యస్. సీఎంగా ఉండగా జలయజ్ఞం చేపట్టారు. ప్రతి జిల్లాలోనూ సాగునీటి ప్రాజెక్ట్‌ల పనులు విరివిగా జరిగాయి. రైతులకు ప్రయోజనాలందించాయి.*

ఇవన్నీ కూడా భారీ ప్రాజెక్ట్‌లు... చరిత్రలో నిలిచిపోయే పనులు. ఈ పనులు పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినప్పుడు ఈ నాయకులెవరూ హంగూ ఆర్భాటాలు చేయలేదు. పండుగలు జరుపలేదు. వడ్డించిన విస్తరి లాంటివి ఈ పనులు. వీటి వెనుక ఉద్దేశ్యం ప్రజలకు ఉపయోగపడడమేగాని పబ్లిసిటీ కోసం కాదు.

ఎంగిలాకు ఎగిరెగిరిపడుతుంటుంది... ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నదుల అనుసంధానం కూడా అలాగే తయారయ్యింది. పని తక్కువ, ఫలితం తక్కువ. ప్రచారార్భాటం ఎక్కువ. గత పాలకులు పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించినప్పుడు కూడా ఇంత ప్రచారం చేసుకోలేదు. ఓ పక్క పోలవరం ప్రాజెక్ట్ మంజూరైంది. పోలవరంకు వై.యస్. (మిగతా 11వ పేజీలో)



## తొలిసారిగా నెల్లూరుకు... కమల్‌హాసన్

'పద్మశ్రీ' బిరుదాంకితులు
కె.విశ్వనాథ్‌తో పాటు
కేంద్రమంత్రి
యం.వెంకయ్యనాయుడు
ఇంకా పలువురు
సినీ రాజకీయ ప్రముఖులు
నెల్లూరుకు రానున్నారు.

(వార్త 11వ పేజీలో)

## కాకాణికే... మళ్ళీ కిరీటం



**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించి గట్టిగా నాలుగేళ్లు కాలేదు. ఆ పార్టీ నెల్లూరుజిల్లా అధ్యక్ష బాధ్యతలను కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండోసారి చేపట్టాడు.**

వైకాపా జిల్లా అధ్యక్షుడిగా ఎవరిని పెడదామా అనే దానికంటే ఎవరు ఈ బాధ్యతను మోస్తారా? అనేదే ప్రశ్నార్ధకంగా ఉండింది. ఈమధ్య పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి రాజీనామా చేయడం జరిగింది. ఆయన రాజీనామాకు పలు కారణాలున్నాయి. జిల్లాలో పార్టీని నడపడం వ్యయంతో పాటు ప్రయాసతో కూడుకున్నదైంది. అధిష్టానం నుండి ఖర్చులకు చిల్లర రాదు. ఏదున్నా జిల్లాలోనే చూసుకోవాలి. ప్రసన్న చూస్తే రాజకీయ కుటుంబీకుడే కానీ వేలకోట్లున్న జమీందార్ కాదు. ప్రతి నెలా ఖర్చులు భరించాలంటే ఆయనకు తలకుమించిన భారమే. ఈరోజుల్లో పార్టీ కార్యకర్తలు కూడా పార్టీ జెండాలు మోయాలంటే డైలీ అలవెన్స్‌లు అడుగుతున్న పరిస్థితి. పార్టీ అధికారంలో వుంటే ఆ తీరువేరు. కాని వైకాపా ప్రతిపక్షంలో వుంది. ఇంకో మూడున్నరేళ్లు పొజిషన్ మారదు. దీనికితోడు జిల్లాలో నాయకులు కూడా ఎవరిదారిలో వాళ్లున్నారు. ఒక్కరు కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడికి అండగా నిలవలేదు. (మిగతా 11వ పేజీలో)





## జడ్పీలో స్వచ్ఛభారత్

మన ఇల్లు, మన వీధి, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో మొదలుపెట్టిన 'స్వచ్ఛభారత్' ప్రతి ఒక్కరినీ ఏదో ఒక రూపంలో కదిలిస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల 19వ తేదీన నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది తమ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి స్వయంగా నడుంవంచి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తూ... మిగతా సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. నెలకోసారి ఈ విధంగా చేస్తే కార్యాలయ ప్రాంగణం ఇప్పటిలాగే ఎప్పుడూ అందంగా ఉంటుంది.

# దొంగ బియ్యం పట్టేసారు

## రూ.47.80లక్షలు విలువ చేసే బియ్యం, ధాన్యం సీజ్

నెల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని రైస్‌మిల్లు, బోగోలులోని పలు రైసు మిల్లులపై సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేషయ్య, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేశారు. ఆయా మిల్లుల్లో అక్రమ నిల్వలను గుర్తించి రూ.47.80లక్షలు విలువైన బియ్యం, ధాన్యం నిల్వలను సీజ్ చేశారు. నెల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని శ్రీ వెంకట శ్రీనివాస రైస్‌మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి రైసు మిల్లులో తరలించేందుకు సిద్ధంగా వుంచిన 470క్వింటాళ్ల బియ్యం, మిల్లు వెనుక వైపున్న గోడౌన్‌లో 2,016క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించి సరైన లెక్కలు లేక పోవడంతో వాటిని సీజ్ చేసారు. వీటి విలువ సుమారు రూ.37.80లక్షలు ఉంటుంది. మిల్లు నిర్వాహకుడు సరైన రికార్డులు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్పీ రమేషయ్య తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సంగమేశ్వరరావు, డిసిటిఓ రవి కుమార్, సిఎస్‌డిటి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మిపురంలోని శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి మిల్లుల్లో నిల్వ ఉంచిన 659 క్వింటాళ్ల ధాన్యాన్ని గుర్తించి రికార్డులు పరిశీలించారు. నిల్వ చేసిన ధాన్యానికి సంబంధించి సరైన రికార్డులు లేకపోవడంతో ధాన్యాన్ని సీజ్‌చేసి నిర్వాహకులపై 6ఏ క్రింద కేసులు నమోదు చేసారు. సీజ్ చేసిన ధాన్యం విలువ రూ.10లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సిఐ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏజి రాము, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసులురెడ్డి, కావలి సిఎస్‌డిటి హరనాథ్, విఆర్వో ఐవి ప్రసాద్ పాల్గొన్నారు.


సింహపురి సమాచారం

## అజ్మీర్ దర్గాకు నెల్లూరు నుండి బెదిరింపు ఫోన్‌కాల్

రాజస్థాన్ ప్రభుత్వానికి అజ్మీర్ దర్గా పేల్చి వేస్తామని సోమవారం ఉదయం గుర్తుతెలియని ఆగంతకులు ఫోన్‌లో హెచ్చరించారు. దీంతో ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఉపయోగించిన సిమ్ కార్డు నెల్లూరుజిల్లా డక్కిలి మండలం మార్లగుంట గ్రామంలోని ఓ మహిళ పేరిట వున్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. వెంటనే వెంకటగిరి సర్కిల్ కార్యాలయానికి ఈ సమాచారం అందించారు. సోమవారం వెంకటగిరి సిఐ శ్రీనివాసరావు మార్లగుంటకు వెళ్లి విచారించారు. శ్రీదేవి అనే గృహిణి పేరుతో ఉన్నట్లు గుర్తించి ఆమెను విచారించారు. ఆమె నాయుడుపేటలో ఓ సిమ్‌కార్డు ఇటీవల కొనుగోలు చేసానని, తనకేమీ తెలియదని ఆమె వారికి చెప్పింది. దీంతో ఇదే చిరునామాతో సిమ్‌కార్డుల విక్రేత మరో సిమ్ ఎవరికిచ్చారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

## సెల్‌టవర్‌తో చేటు

డబ్బు కోసం ఆరోగ్యాలను హరించే వ్యాపారం చేయొద్దని, ఇండ్ల మధ్య, పాఠశాలల మధ్య సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వుంటుందని అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, విద్యార్థులు, ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. ఇండ్ల మధ్య ఉన్న సెల్‌టవర్ల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలపై ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఈ ఆందోళన కార్యక్రమం భారీ ఎత్తున సాగింది. వెంకటేశ్వరపురం లోని డాన్‌బాస్కో పాఠశాల వీధిలో ఉంటున్న అంగడి నారాయణ తన ఇంటి మిద్దెపైన సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతివ్వడంపై స్థానికులంతా ఏకమై ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టవర్ ఏర్పాటు చేస్తున్న ఇంటి వద్ద నుంచి ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో తిరిగి సెల్‌టవర్ నిర్మిస్తున్న ఇంటివరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్షం కన్వీనర్, సిపిఎం నగర ప్రధాన కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే కోర్టుకెళ్లి న్యాయం కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌బాబు, మూలం ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, ముజీర్, జహీర్, రసూల్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, తుమ్మల మేరీ, వివేకానంద, జాషువా తదితరులు పాల్గొన్నారు.



# రైతు కోసం వచ్చిన చంద్రన్న తమ్ముళ్ళు

ఈ నెల 23వ తేదీన నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో 'రైతు కోసం చంద్రన్న' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన కారణంగా రాలేకపోయారు. ఆయనకు బదులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సిద్దా రాఘవరావు, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు విచ్చేసారు. ముగ్గురు మంత్రులు కూడా చంద్రన్న విజయాలంటూ డబ్బా కొట్టారు. రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా మార్చాలన్న సంకల్పంతో పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణ నదుల అనుసంధానం చేసామని, రానున్న రోజుల్లో కృష్ణ-పెన్న నదుల అనుసంధానం కూడా చేస్తామని పత్తిపాటి పుల్లారావు చెప్పుకొచ్చారు. 24వేల కోట్ల ఋణమాఫీని అమలు చేసినట్లు కూడా చెప్పారు. సిద్దా రాఘవరావు మాట్లాడుతూ లోటుబడ్జెట్ వున్నప్పటికీ చెప్పిన హామీలన్నింటిని అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రాన్ని నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి చంద్రబాబు పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడుతున్నారని పల్లె రఘునాథరెడ్డి చెప్పుకొచ్చారు.

జిల్లా కలెక్టర్ యం.జానకి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు, మేయర్ అజీజ్, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పనులు చేయండి... పన్నులు కడతారు



అభివృద్ధి పనులు చేస్తే ప్రజలు పన్నులు కడతారని, లేకుంటే కట్టే ప్రసక్తేలేదని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వావిలేటిపాడులో జరుగుతున్న డ్రైయిన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విలీన పంచాయితీల్లో రోడ్ల నిర్మాణాని కంటే ముందుగా డ్రైయిన్లు నిర్మించాలన్నారు. విలీన గ్రామాలకు నిధుల కేటాయింపు సక్రమంగా జరగడం లేదన్నారు. పన్నుల భారాన్ని ప్రజలపై మోపడం సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో మోపూరు రాధాకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చక్రి, షాను, సోను, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు ముద్దాయి సోనియానే...



యూపిఏ హయాంలో జరిగిన బొగ్గు కుంభకోణంలో సోనియాగాంధిని మొదటి ముద్దాయిగా చేర్చాలని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులను బిడ్డింగ్ రూపంలో కాకుండా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి రూ.1.86లక్షల కోట్లు లబ్ది చేకూర్చారని ఆరోపించారు. బొగ్గు కేటాయింపులు మాజీప్రధాని మన్మోహన్ సింగ్ కనుసన్నల్లోనే జరిగాయని ముద్దాయిగా వున్న దాసరి సిబిఐ కోర్టు ముందు చెప్పారన్నారు. మొత్తం 40,404లక్షల టన్నుల బొగ్గును కారుచౌకగా కట్టబెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. మన్మోహన్‌సింగ్ స్వతహాగా నిజాయితీపరుడైనా సోనియాగాంధీ చేతిలో కీలుబొమ్మగా మారి లక్షల కోట్ల దోపిడీకి సాక్ష్యంగా నిలిచి చరిత్రహీనుడయ్యాడని ఆరోపించారు. గత యూపిఏ హయాంలో జరిగిన కుంభకోణాలతో సోనియా కుటుంబం దేశ పరువు ప్రతిష్టను మంటగలిపిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన ద్వారా కాంగ్రెస్ పార్టీ మార్చురీలోకి వెళ్లిందని రఘువీరారెడ్డే చెప్పుకున్నారని, కాంగ్రెస్ చేసిన పాపాలకు ఇది చాలా తక్కువ శిక్ష అని సోమిరెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వంపై తిరగబడండి...

# ప్రత్యేకహోదా కోసం పోరాడండి



ఓటుకు నోటు కేసు నుంచి చంద్రబాబు బయటపడేందుకు ప్రత్యేకహోదా డిమాండ్‌ను పక్కదోవ పట్టిస్తున్నాడని, రూ.లక్షన్నర కోట్ల స్పెషల్ ప్యాకేజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ ప్యాకేజీ బాబుకో... ఆయన తనయుడు చినబాబుకో చేరుతుందని ఒంగోలు ఎంపి, నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ పార్టీ పరిశీలకులు వై.వి.సుబ్బారెడ్డి విమర్శించారు.

ఈ నెల 26వ తేదీ వైయస్ జగన్ చేపడుతున్న దీక్షపై అవగాహన కల్పించేందుకు బుధవారం నెల్లూరులోని జిపిఆర్ కల్యాణ మండపంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా వస్తే అనేక పరిశ్రమలు, వేలాది ఉద్యోగాలు వస్తాయని, దీనివల్ల వారి కుటుంబాలన్నీ బాగుపడుతాయని... అందుకే వైయస్ జగన్ నిరాహారదీక్ష చేస్తున్నాడని, ఆయనకు అందరం మద్దతు ఇస్తామన్నారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు ప్రజలను మోసం చేసాయని, తిరుపతి ఎన్నికల ప్రచారంలో మోడీ, బాబు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారు. తిరుపతి ఎంపి వరప్రసాద్ మాట్లాడుతూ నీరు-చెట్టు దుర్మార్గమైన కార్యక్రమమని, టిడిపి అక్రమాలను ఎండగడుతామన్నారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని, కొండంత గుండె కలిగిన నాయకుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా ఉద్యమం టిడిపికి కనువిప్పు కావాలన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయిన తర్వాత విద్యార్థులు, మహిళలు, రైతులు బలయ్యారన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయమే దండగన్న చంద్రబాబు.. 'రైతు కోసం చంద్రన్న' అంటూ నాగలి పట్టి ఫోటోలు ఇవ్వడం బఫూన్‌ను తలపిస్తోందన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం దీక్ష చేసే ధైర్యం ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే ఉందన్నారు.

వైయస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మిడ్‌నైట్ మంత్రి నారాయణ జిల్లాకు పట్టిన దౌర్భాగ్యమని, జగన్‌ను సిఎం చేసేంత వరకు పార్టీలోనే ఉంటానన్నారు.

ప్రత్యేకహోదా అవసరమని నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, మేరిగ మురళీధర్, పొట్టేళ్ల శిరీషా, శ్రావణ్, బండ్లమూడి అనిత, రూప్‌కుమార్‌యాదవ్, ముక్కాల ద్వారకానాథ్‌లు తమ ప్రసంగాల్లో అన్నారు. తొలుత వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# ఆనందోత్సాహాలతో.. నిమజ్జనోత్సవం



వినాయకచవితి మూడవరోజు నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ విగ్రహాలను నిమజ్జనం చేశారు. వేదాయపాలెం, భక్తవత్సలనగర్, కాపువీధి, రాణా ప్రతాప్ సెంటర్, కరెంట్ ఆఫీసు సెంటర్, ప్రగతి నగర్, ఎన్‌సిసి కాలని, విఆర్సీ సెంటర్ తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన గణేష్ విగ్రహాలను, మేళతాళాలతో, బ్యాండు మేళాలు, మంగళ వాయిద్యాలతో, బాణాసంచా పేలుళ్లతో వేడుకగా ఊరేగింపుగా తీసుకెళ్లి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. గాంధీబొమ్మ సెంటర్‌లో నెలకొల్పిన గణపతి నిమజ్జనోత్సవాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేదాయపాలెంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. స్టోన్‌హౌస్‌పేట కంసాలివీధిలో ముక్కాల ద్వారకానాథ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, గణపతి హోమం, అన్నదాన కార్యక్రమం, స్వామి వారికి విశేష ఫలార్చన కార్యక్రమాలు జరిగాయి. శివాజీ సెంటర్‌లో బీజేపీ అధ్యక్షులు సురేంద్రరెడ్డి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శబరి శ్రీరామక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని నగర ప్రముఖులు, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. కాకర్లవారివీధి, బాలాజీనగర్, పెద్దబజార్, శ్రీనివాస అగ్రహారం తదితర ప్రాంతాల్లో పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తెనాలి బ్యాండ్, నాసిక్ బ్యాండ్, కేరళ బ్యాండు, బుట్ట బొమ్మలతో ఊరేగింపుతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సంతపేట కూరగాయల మార్కెట్టు వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు నిమజ్జన కార్యక్రమ నిర్వాహకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి అధికార ప్రతినిధి జడ్.శివప్రసాద్, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మెంటా రామ్మోహన్, మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అయితే పెన్నానదిలో తగినంత నీరు లేకపోవడంతో వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు ఎదురయ్యాయి.





## 'ప్రభా'తం

# రిజర్వేషన్లపై కలకలం

**రిజర్వేషన్ల అంశంపై సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. అయితే, అలాంటిదే జరిగితే సహించేది లేదని, రిజర్వేషన్లకు భంగం కలిగిస్తే ఆందోళనలు తప్పవని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి. బిజెపి మాత్రం అసలు ఆ ఉద్దేశమే తనకు లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ అంశంపై ఏ మేరకు స్పందించాలో బిజెపి రాజకీయాలకు అతీతంగా అందరితో చర్చించి ఒక నిర్దిష్టమైన అభిప్రాయానికి రావడం సముచితం.**

దేశంలో ఇప్పుడిప్పుడే రిజర్వేషన్ల అంశంపై కలకలం రేకెత్తుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పుడది పెద్ద చర్చనీయాంశంగా వుంది. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు, ఈ అంశంపై ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు పెద్ద సంచలనం రేపాయి.

'దేశంలో రిజర్వేషన్ల అవసరం ఎవరికి వుంది. వారికి ఎంతకాలం పాటు రిజర్వేషన్లు కల్పించాలి'.. అనే అంశాలపై ఒక కమిటీని ఏర్పాటుచేయాలని, ఇందులో చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులకు చోటు కల్పించాలని, రాజకీయనాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ కమిటీ రిజర్వేషన్లపై నివేదిక ఇవ్వాలని'.. అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో దుమారం రేకెత్తిస్తున్నాయి. ప్రజాస్వామంలో ప్రతి ఒక్కరికీ ఎన్నో ఆశలు వుంటాయని, అయితే ఒత్తిళ్ళకు తలొగ్గి, అధికశాతం ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి కొందరి ఆశలను నెరవేర్చాలనుకోవడం సరికాదని ఆయన అంటూ, 'మన రాజ్యాంగ నిర్మాతలు సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని తీసుకొచ్చారని, ఈ అంశాన్ని గుర్తిస్తే రిజర్వేషన్ల విధానంపై ఎలాంటి ప్రశ్నలు తలెత్తవు'.. అని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ ఒత్తిళ్ళ విషయంలోనూ ప్రభుత్వం అప్రమత్తంగా వుండాలని ఆయన సూచించారు. ఓబిసి రిజర్వేషన్ల కోసం గుజరాత్‌లో పటేళ్ళ ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో భగవత్ చేసిన ఈ వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించాయి. ఈ వ్యాఖ్యలపై ప్రత్యేకించి ఆర్జేడి, జేడియు మండిపడ్డాయి కూడా. భగవత్ ప్రతిపాదనల్ని జేడియు తిరస్కరించింది. అయితే, బిజెపి మాత్రం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, రిజర్వేషన్లపై ఏ తరహా సమీక్షకైనా తాము వ్యతిరేకమని స్పష్టం చేయడం గమనార్హం. అయితే, ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రిజర్వేషన్ల అమలు వల్ల దళితులు, వెనుకబడిన కులాలు, వర్గాల వారికి ఎంతో ప్రయోజనం వుంటుంది కనుక, ఈ విషయంలో అటు రాజకీయనాయకులు కానీ, ఇటు కేంద్రం కానీ ఆచితూచి వ్యవహరించాల్సి వుంది. ఏ సామాజిక ప్రయోజనం కోసమైతే ఈ విధానం అమలులోకి వచ్చిందో దృష్టిలో పెట్టుకుని, ఆ విధానం వల్ల ఒనగూరిన మేలును ఒకసారి సమీక్షించుకుని, జాతి పురోభివృద్ధికి.. మొత్తంగా దేశసమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాల్సివుంది. అలా కాక, ఏకంగా రిజర్వేషన్లపై సమీక్షించాలనుకోవడం కొత్త సమస్యలకు దారితీస్తుందే తప్ప, కొత్తగా ఒనగూరేదేమీ వుండకపోవచ్చు. అది ఏ అంశమైనా సరే, అందరూ కలిసి చర్చించుకోవడం వల్ల వచ్చే ఇబ్బందేమీ వుండదు కానీ, దానిని ఏ రాజకీయప్రయోజనానికో ముడిపెట్టి చూసుకున్నప్పుడే ఆ సమస్య మరింత జటిలంగా కనిపిస్తుంది.

ప్రతి విషయాన్నీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా చూసినపుడు ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతుంటాయి. అసలు బీహార్ ఎన్నికల నేపథ్యంలో, ఇలాంటి ప్రస్తావనలు రావడమే ఇందులో రాజకీయాలు పరోక్షంగా వున్నాయేమోననే అపోహ ప్రజల్లో కలిగేందుకు దోహదం చేస్తుంది. దీంతో, సమస్య మరో దారికి మళ్ళుతోంది. అసలు ఆర్ఎస్ఎస్, బిజెపి, విశ్వహిందూ పరిషత్ ఒకే సిద్ధాంతంపై నడిచేవే కనుక, ఇందులో ఏ ఒక్కరు ఏది చెప్పినా, అది మిగిలిన ఇద్దరికీ సముచితమనే అన్పించాలి తప్ప, భిన్నాభిప్రాయం వస్తే పరిస్థితి ఇలాగే వుంటుంది. అసలు సమస్య కన్నా, ఇలాంటి కొసరు సమస్యే పీటముడిగా మారుతుంది. అందులోనూ రిజర్వేషన్ల వంటి సున్నితమైన అంశాల పట్ల ప్రత్యేకించి మరింత సంయమనం అవసరం. అందరూ ఒకే మాటగా-ఒకే బాటగా వుంటే ఈ కథ మరో మలుపు తిరిగి వుండేదేమో!.. ఆర్ఎస్ఎస్ నేత వ్యాఖ్యలకు బిజెపి దూరంగా వుంటే, విహెచ్‌పి ఆర్ఎస్ఎస్ నేత మాటలను సమర్ధిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో బిజెపి పరిస్థితి ఇరుకున పడుతోంది.

అందుకే, బిజెపి ఇక తనమాటగా చెప్పాలనుకున్నదేమిటో చెప్పనే చెప్పింది. అసలు "రిజర్వేషన్లపై సమీక్షించే ఉద్దేశం కేంద్రానికి లేదని" కేంద్రం తరపున కేంద్రమంత్రి రవిశంకర్ స్పష్టం చేయడంతో కథ మళ్ళీ యధాతథ స్థితికి వచ్చింది. అయినా, రిజర్వేషన్ల అంశం రాజ్యాంగ పరిధిలోది కావడం వల్ల, ఏది జరిగినా అంతా రాజ్యాంగబద్ధంగా జరగాలే తప్ప, ఎవరి చిత్తానుసారం వారు వ్యాఖ్యలు చేసినందువల్ల చివరికి ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో వారికే తెలియాలి. మరి ఇంత యాగీ ఎందుకంటే, బీహార్ ఎన్నికల నేపథ్యమనే విషయం.. రాజకీయవర్గాలకే కాక, సామాన్యులకు కూడా అర్ధమవుతున్న సంగతి. అందుకే, బిజెపియేతర పార్టీలు, విపక్షాలు ఈ అంశాన్ని ఇదే అదనుగా మరింతగా చర్చనీయాంశం చేస్తుండడం గమనార్హం.

భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ తీవ్రంగా స్పందిస్తూ, 'మోడీ.. తన మాస్టర్ భగవత్ ఆదేశాల మేరకు రిజర్వేషన్లకు ముగింపు పలుకుతారా తేల్చిచెప్పాలి'.. అంటూ ట్విట్టర్‌లో ట్వీట్ చేయడమే కాక, అదే జరిగితే దళితులు, వెనుకబడిన తరగతులవారు తగిన సమాధానం ఇస్తారని కూడా పేర్కొన్నారు. ఇదే సందర్భమని, అసలు 'ఎన్నాళ్ళీ రిజర్వేషన్లు?'..అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ తివారి మరోవైపు ప్రశ్నలు సంధిస్తున్నారు. దళితులను తిరిగి చీకటి యుగంలోకి నెట్టివేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని ఇంకోవైపు బిఎస్పీ అధినేత్రి మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా విపక్షాల ఆరోపణలు మిన్నుముడుతున్న సమయంలో ప్రతి విషయమూ ఒక సంచలనమై కలకలం రేపుతూనే వుంటుంది. అందువల్ల, రిజర్వేషన్ల అంశంపై కేంద్రం ఒక స్పష్టమైన విధానంతో వుండడం అవసరం. అందుకు అటు రాజ్యాంగనిపుణులు, అన్ని పార్టీల నాయకులు, మేధావులు అందరితో కలిసి చర్చించి ఈ అంశంపై ఏ మేరకు స్పందించాలో ఒక అభిప్రాయానికి రావాల్సివుంది. రిజర్వేషన్లను సమీక్షించడమంటే వాటిని పూర్తిగా ఎత్తివేయడమో, లేక దళిత వర్గాలకు అన్యాయం చేయడమో కాదు. ఈ రిజర్వేషన్లను వెనుకబడిన వర్గాలలో కూడా ఎవరికి అవసరమో గుర్తించాలి. రిజర్వేషన్లు అమలులోకి వచ్చి 65ఏళ్ళయ్యింది. కొన్ని వర్గాలలో వీటి పట్ల అసంతృప్తి పెరుగుతోంది. ఇంకో వందేళ్లకు కూడా ఈ రిజర్వేషన్లు ఇలాగే ఉంటాయి. కాని దళిత వర్గాలలో ఐఏఎస్ కొడుకు ఐఏఎస్ అవుతాడు, చేపలు పట్టేవాడి కొడుకు చేపలు పడుతుంటాడు. ఎవరికి రిజర్వేషన్ల అవసరమో గుర్తించే విధంగా సమీక్ష జరపడం సముచితమవుతుంది.

అంశం ఏదైనా సరే, రాజకీయనేతలు, మేధావులు.. అందరూ కలిసి చర్చించుకుని దేశభవిష్యత్తు, దేశపురోభివృద్ధి లక్ష్యంగా పురోగమించడమే ముఖ్యం. అదే దేశశ్రేయస్సుకు మేలైన మార్గం!...

---

## 2019 జాతీయ క్రీడలకు
# నెల్లూరు వేదిక

అంతర్జాతీయ స్థాయి స్టేడియాల నిర్మాణాలతో 2019 జాతీయ క్రీడలకు నెల్లూరు వేదిక కాబోతుందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) డైరెక్టర్ రవీంద్ర బాబు పేర్కొన్నారు. 19న నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి క్రీడా మైదానంలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మండల పరిధిలోని మొగళ్ళ పాలెంలోని 150ఎకరాల్లో 2019లో జాతీయ క్రీడలను నిర్వహించేందుకు స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు. స్టేడియం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా ఆరుకోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. 2019 జాతీయ క్రీడలను ఉత్తరాఖండ్‌లో నిర్వహించాల్సి వుందని, అయితే అక్కడి వాతావరణ పరిస్థితులు, స్థితిగతులు, జాతీయ క్రీడల నిర్వహణ కోసం అవసరమైన బిడ్ రూ.50లక్షల చెల్లింపులో జాప్యం చోటు చేసుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ భారత్ ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రభుత్వం, శాప్ తోడ్పాటుతో జాతీయ క్రీడల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

ఈ సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎతిరాజ్ పాల్గొన్నారు.

# సేవాతత్పరులకు సత్కారం



నెల్లూరు చిన్నబజార్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులకు సన్మానం చేసినట్లు సేవాసంస్థ అధ్యక్షులు భాజన వెంకటశేషయ్య ఆచారి తెలిపారు. పొందూరు చెంచయ్యస్వామి ఆచారి(పౌరోహిత్యం), పాలూరు రాధాకృష్ణయ్య ఆచారి(విద్య, సామాజిక రంగం), బుదమగుంట రామసుబ్బయ్య ఆచారి(స్వర్ణకార రంగం), యమ్.యస్.నటరాజన్ ఆచారి(అచ్చుల తయారీ), సీమకుర్తి చెంగల్రాయ ఆచారి(స్వర్ణకార రంగం)లకు అందజేశారు. యం.శివరామమ్మ అనే నిరుపేద మహిళకు కంటి ఆపరేషన్‌కు సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఎస్.వి.ఎస్ బట్టీ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కందుకూరు మోహన్ ఆచారి, ప్రధాన కార్యదర్శి లేంబూరు రాజేంద్రప్రసాద్ ఆచారి, యల్.గోపీకృష్ణఆచారి, బి.జగదీష్ ఆచారి, యల్.మురుగఆచారి, ఎన్.నారాయణ, ఎ.సీతారామయ్య ఆచారి, సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో గ్రీవెన్స్ డే

నెల్లూరు మునిసిపల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినాన్ని పురస్కరించుకుని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ మూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆయా విభాగాలకు పంపించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

---

## కిరోసిన్ వృధా

గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి కిరోసిన్ కోత విధించింది ప్రభుత్వం. అయితే రేషన్ దుకాణాలకు పంపే జాబితాలలో కిరోసిన్ కోటా నుండి అందరి పేర్లు తొలగించడం లేదు. కిరోసిన్ పంపిణీ పేరుతో అధికారులు, డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గ్రామాలలో అందరి ఇళ్లల్లోనూ విద్యుత్ ఉంటుంది. గ్యాస్ లేని వాళ్ళు వంటకు కట్టెలను వాడుతున్నారు తప్ప కిరోసిన్‌ను వాడడం లేదు. 2014ఎన్నికల తర్వాత ప్రభుత్వం పామోలిన్ పంపిణీని నిలిపేసింది. అసలే నూనెల ధరలు మండుతున్నాయి. గ్రామాల్లో కిరోసిన్ బదులు పామోలిన్‌ను సరఫరా చేస్తే ప్రజలు సంతోషిస్తారు.

**మలిరెడ్డి జయరామిరెడ్డి, గుండవోలు.**

## చీటింగ్ కేసు

రాజకీయ స్వప్రయోజనం కోసం రాష్ట్రాన్ని విభజించి, రెండు తెలుగు రాష్ట్రాలను అష్టకష్టాలు పాలు చేసిన సోనియా మీద ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయాలి. తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చిన చంద్రబాబు రెండవ ముద్దాయి. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయమన్నారు కానీ ఒకే ఒక అబద్ధమాడి ప్రత్యేక హోదా ఇస్తామంటూ ప్రత్యేక టోపీ పెట్టిన మోడీ, వెంకయ్యల మీద చీటింగ్ కేసు పెట్టాలి. మొదటి ముద్దాయి అయిన సోనియాను వదిలేసి మిగతా వారి మీద కళ్యాణదుర్గం పిఎస్‌లో రఘువీరా కేసులు పెట్టడమేమిటి?

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## బీడు భూములను వాడుకోండి

పరిశ్రమల పేరుతో పచ్చని పైర్లు పండే భూములను పాడుచేయొద్దు. అది మనకే కాదు, మన తర్వాత తరాల వారికి కూడా ఆహార ఉత్పత్తులనిస్తాయి. పరిశ్రమలకు బీడు భూములు వాడుకోండి. ఎలాగూ పంటలు పండని భూములు. రైతులకు మంచి ధర ఇచ్చి కొనుక్కుంటే రైతులు ఆ విధంగానన్నా లబ్ది పొందుతారు. రైతులకు రెండు విధాలా మేలు చేసే పారిశ్రామిక విధానాన్ని అనుసరించండి.

**సి.మహేశ్వర్‌రెడ్డి, నెల్లూరు.**

## ర్యాగింగ్‌కు కఠిన శిక్ష

ఆధునిక మానవుడు ఆదిమానవుడు, ఆటవిక మానవుడు అవుతున్నాడనేందుకు సాక్ష్యం ర్యాగింగ్. ఈ సంస్కృతి విదేశాలది. పల్లెల నుండి అమ్మా, నాన్నలు చదువుకోమని డబ్బు పంపిస్తే కాలేజీల్లో చేరి సీనియర్లు, జూనియర్లు అంటూ ర్యాగింగ్ పేరుతో దారి తప్పుతున్నారు. రాక్షసత్వంగా ర్యాగింగ్ చేసి అమాయకుల జీవితాలను బలి తీసుకునే స్టూడెంట్ రాబందులకు కఠిన శిక్షలు వేయాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**



# కోర్టులో 'పోర్టు'




వాకాడు మండలం దుగరాజపట్నం పోర్టు విషయంలో అక్కడ స్థానికుల కంటే కూడా మాజీఎంపీ చింతా మోహన్ ఎక్కువ చింతాక్రాంతుడవుతున్నాడు. దుగరాజపట్నం పోర్టు పనులను ప్రారంభించడంలో జాప్యంపై సుప్రీంకోర్టులో ఆయన తాజాగా పిల్ దాఖలు చేసారు. యుాపిఏ ప్రభుత్వ హయాంలో దుగరాజపట్నం పోర్టు కోసం ఎక్కువుగా ప్రయత్నించింది అప్పుడు తిరుపతి ఎంపీగా వున్న చింతా మోహనే! నెల్లూరుజిల్లాలో వున్న నాయకులు కూడా అప్పుడు ఈ పోర్టుపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. చింతామోహన్‌కు ప్రత్యేక ఆసక్తి ఎందుకుందోగాని కేంద్రంలో తన పలుకుబడి అంతా ప్రయోగించి దుగరాజపట్నం పోర్టును మంజూరు చేయించడమే కాక గెజిట్‌నోట్ కూడా విడుదల చేయించారు. అయితే ఎన్నికలలోపు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేత ఈ పోర్టుకు శంకుస్థాపన చేయించాలనుకున్న చింతా కోరిక మాత్రం నెరవేరలేదు. అప్పుడు రాష్ట్రాన్ని విభజించడమే తమ జీవిత కర్తవ్యంగా ఎంచుకున్న కాంగ్రెస్ పెద్దలు ఈ పోర్టును పూర్తిగా మరచిపోయారు. ఎన్నికల తర్వాత ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. దుగరాజపట్నం పోర్టును గాల్లో పెట్టారు. అవుతుందనీ చెప్పడం లేదు, కాదనీ చెప్పడం లేదు. చింతాకు ఈ పోర్టు మీద ఆశ, ఆసక్తి చావలేదు. అందుకే తన ప్రయత్నంగా కోర్టును ఆశ్రయించాడు.

## టోల్‌పై వున్న శ్రద్ధ రోడ్డుపై ఏదీ!

టోల్ ఫీజుల వసూలుపై వున్న శ్రద్ధ రోడ్ల నిర్వహణపై ఉండడం లేదు. జాతీయ రహదారిపై వాహనాలలో పోతున్నామంటే బండి అదరకూడదు. కాని కాంట్రాక్టర్ల నిర్వహణలోపం కారణంగా జాతీయ రహదారి కూడా అక్కడక్కడా గ్రామీణ రోడ్డును తలపిస్తుంది. జిల్లాలో జాతీయరహదారి నిర్వహణ సక్రమంగా ఉండడం లేదు. టోల్ ఫీజులు దండుకోవడం తప్పించి రోడ్లను పట్టించుకోవడం లేదు. గూడూరు, ఓజిలిల మధ్య చెన్నై వెళ్లే రహదారి గతుకులమయంగా వుంది. అక్కడక్కడా ప్యాచ్‌లు వేసి వున్నారు. కొన్నిచోట్ల రోడ్డు గుంతలు పడి వుంది. జాతీయ రహదారిపై వాహనాల వేగం వందకిలోమీటర్లకు తక్కువ వుండదు. హఠాత్తుగా ఈ గుంతల వద్దకు వచ్చినప్పుడు డ్రైవర్లు సడెన్ బ్రేకులు వేయాల్సి వస్తోంది. దీంతో వెనుక వాహనాలు సడెన్‌గా ఆగిపోవాల్సి వస్తూ, ఆందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు నిర్వాహకులు రోడ్డు పరిస్థితి గుర్తించి ప్యాచ్‌లతో సరిపెట్టకుండా పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సివుంది.



- రసవత్తరంగా డెయిరీ పోరు

# 'విజయ'ం ఎవరిదో?



జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార లిమిటెడ్(విజయ డెయిరీ)లో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు ప్రకటించారు. వీటిలో రేగడిచెలిక సొసైటీ నుండి నామినేషన్ వేసిన గుర్రం నాగేశ్వరమ్మ, బాలాయపల్లి మండలం వెంగమాంబపురం నుండి నామినేషన్ వేసిన దామా శ్యామలమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి పోటీగా ఎవరూ నామినేషన్లు వేయలేదు. మరో డైరెక్టర్ పదవి కోసం అల్లూరు మండలం నార్తమోపూరు నుండి నామినేషన్ వేసిన ప్రస్తుత డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిపి గూడూరు మండలం పోట్లపూడి నుండి నామినేషన్ వేసిన చిల్లకూరు సుధీర్‌రెడ్డిలు పోటీ పడుతున్నారు. ప్రస్తుత డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పదవీకాలం ఈ నెల 30తో ముగుస్తుంది. కాబట్టి ఈ నెల 26న డైరెక్టర్ ఎన్నికతో పాటు కొత్త ఛైర్మెన్ ఎన్నిక కూడా ఉంటుంది. వివిధ సొసైటీలకు సంబంధించి 350మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. ఇద్దరూ ఛైర్మెన్ రేసులో ఉన్నవాళ్లే! దాంతో డైరెక్టర్ ఎన్నిక రసవత్తరంగా మారింది.

# వికలాంగుల వెన్నంటే వుంటా...



ఈ నెల 21న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో 25మంది వికలాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జిల్లా అధికారుల సహకారంతో కెఎల్‌యస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కొల్లి లక్ష్మీశ్రీధర్‌రెడ్డి చేయూతతో కొంతమంది దాతల సహకారానికి తోడు సొంత నిధులు కలిపి మొత్తం 105మంది వికలాంగులకి ట్రైసైకిళ్ళు అందజేశామని, వికలాంగ సోదరులు ఎలాంటి శ్రమకు లోనుకాకుండా నేరుగా వారి వద్దకే వెళ్ళి లేదా వారిని ప్రత్యేక వాహనాలలో తీసుకువచ్చి ట్రైసైకిళ్ళు అందించామన్నారు. అంతమంది వికలాంగులకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. జిల్లాలో వికలాంగ సోదరులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి వికలాంగ సోదరుడికి పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని, వారి స్వయం ఉపాధికి బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఋణాలు అందించాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి యాకసిరి శరత్‌చంద్ర, తాళ్లూరు సురేష్‌బాబు, కట్టా వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

రండి - "వరల్డ్ హార్ట్ డే" సందర్భంగా ఏర్పాటు చేయబడిన
మా అవగాహనా సదస్సుకు హాజరుకండి

వరల్డ్ హార్ట్ డే
సందర్భంగా
ఉచిత పరీక్షలు
ఆర్‌బిఎస్, బిపి & ఇసిజి



గుండె వ్యాధులకు సంబంధించిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు పొందండి

గుండె జబ్బులపై అవగాహన సదస్సు
ముఖ్యంగా :
గుండెపోటు
వ్యాధి లక్షణాలు
చికిత్స
జాగ్రత్తలు
పిల్లలలో గుండె జబ్బులు
పేస్‌మేకర్

ఏ విధమైన సందేహాలు ఉన్న ఈ సదస్సు ద్వారా నివృత్తి చేసుకోగలరు.

సింహపురి డాక్టర్స్:
డా. సి. భక్తవత్సల రెడ్డి, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
డా. ఎ. భాస్కర్ రెడ్డి, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
డా. షర్మిల, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
డా. శ్రీనివాస్, కన్సల్టెంట్ - ఎమర్జన్సీ & ఇంటెన్సివ్ కేర్


గుండెపోటు - నివారణ మరియు చికిత్స గురించి ప్రేక్షకులు మరింత సమాచారం తెలుసుకొనుటకు సహాయపడే ప్యానల్ మెంబర్స్.
డా. ఎస్.ఎస్. రెడ్డి - MS, FICS
డా. ఎస్. సత్యనారాయణ మూర్తి - BSc, MBBS, D DIAB - యుగోస్లేవియా
డా. ఐ. అనిల్ కుమార్ రెడ్డి - MBBS, D DIAB - యుగోస్లేవియా
డా. టి. సౌందర్ రాజన్ - MD జనరల్ మెడిసిన్
డా. సి. మల్లికార్జున్ - MBBS, MDRC మద్రాస్

తేది: 29 సెప్టెంబర్ సమయం: సా॥ 6 గంటల నుండి
వేదిక: జిపిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ , మిని బైపాస్ రోడ్, టి.డి.పి. ఆఫీస్ దగ్గర, నెల్లూరు.
మరిన్ని వివరాల కొరకు సంప్రదించండి:
0861-6680102/103, 8008 104 199, 8008 104 212

Simhapuri Hospitals
Multi-Super Specialty Services
ఎస్ హెచ్ - 5, చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్స్, నెల్లూరు
T: 0861-6680 100
E: info@simhapurihospitals.com
www.simhapurihospitals.com

# నెల్లూరు కబుర్లు

## రైతన్న కోసం రాని చంద్రన్న



ఈ నెల 23న నెల్లూరులో జరిగిన 'రైతు కోసం చంద్రన్న' సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రావాల్సి వున్నా, రాలేకపోయారు. ఆయన అమరావతి రాజధాని పని మీద సింగపూర్‌లో ఉండిపోయారు. ఆయన బదులు ముగ్గురు మంత్రులు శిద్దా రాఘవరావు, పల్లె రఘునాథరెడ్డి, పత్తిపాటి పుల్లారావులు వచ్చారు. చంద్రన్న పాలన సూపర్ అంటూ విజయ గాథలు వినిపించారు. ఇక మన జిల్లా మంత్రి నారాయణ యథాఫలంగా ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. చంద్రబాబుతోనే సింగపూర్‌లో ఉన్నారు. అక్కడ జరిగేది రాజధాని సబ్జెక్ట్ మీద, మన మంత్రి లేకుంటే పని జరగదు కదా!

## ఏ.సి కి నివాళి



మాజీమంత్రి దివంగత ఏ.సి సుబ్బారెడ్డి 48వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 20న నెల్లూరు, ఏసి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆనం కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆనం రంగ మయూర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పత్తి రవీంద్ర బాబు, మునాఫ్, నరసింహారెడ్డి, కొట్టే వెంకటేశ్వర్లు, షమీమ్, ఆనం అబ్బాయిరెడ్డి, దినకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, గాంధీ, పత్తి రాము, ఇలియాజ్, నజీర్, మూలం భాస్కర్, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అనూష, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ గవర్నర్ పర్యటన




వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 203 గవర్నర్ ఎస్.సి సుబ్రహ్మణ్యం అధికార పర్యటన సందర్భంగా 20వ తేదీ నెల్లూరుజిల్లాలోని వాకర్స్ అసోసియేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని శ్రీ నేతాజీ(ఎంఎస్ఆర్) పైలెట్ హైస్కూల్ నందు జరిగిన వాకర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలలో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచాలని, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్యశిబిరాలు, వాకింగ్‌ను ప్రోత్సహించాలని అన్నారు. వాకర్స్ జిల్లా మాజీగవర్నర్ యం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్లను 28 నుండి 50వరకు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వాకర్స్ అసోసియేషన్ నుండి సుబ్బారావు, మస్తానయ్యలు మహాత్మాగాంధీ ఫెలోషిప్‌ల కొరకు చెరో 10వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్య యాదవ్, డాక్టర్ కె.అంకిరెడ్డి, ఎలక్ట్ గవర్నర్ బి.మనోహర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ దర్శి నరసింహారావు, ఎం.వెంకటాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్లజోళ్లు




లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారు దత్తత తీసుకున్న నెల్లూరు రంగనాయకులపేట పిఎంఆర్ హైస్కూల్‌లోని 200మంది విద్యార్థులను డాక్టర్ కంటి పరీక్షలు నిర్వహించగా 50మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించి క్లబ్ ఆధ్వర్యంలో స్కూలు ఆవరణలో ఈ నెల 19న ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు తోట నాగరాజు, కార్యదర్శి కె.ప్రవీణ్ శంకర్, కోశాధికారి ఆర్.హజరత్‌బాబు, పిడిజి ఎం.వి.రమణయ్య, పూర్వపు అధ్యక్షులు కె.జగన్‌మోహన్‌రావు, బి.వెంకటేశ్వరరావు, పి.ధనుంజయ, కె.ప్రేమ్‌శంకర్, వై.వి.సుబ్బారావు, టి.మోహన్‌రాజ్, స్కూల్ హెడ్‌మాస్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వెంకయ్య రాలేదు



ప్రతి యేటా వినాయకచవితికి కేంద్ర మంత్రి యం.వెంకయ్యనాయుడు క్రమం తప్పకుండా నెల్లూరొస్తుంటాడు. సీమా సెంటర్‌లో ఏర్పాటు చేసే గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తుంటారు. అలాగే మరి కొన్ని ప్రాంతాలకు కూడా వెళుతుండేవాళ్ళు. ఈసారి బీహార్ ఎన్నికలు, పని ఒత్తిడి వల్ల ఆయన ఢిల్లీ వదిలి నెల్లూరుకు కదలలేకపోయారు.

## అడిషనల్ కమిషనర్‌గా రవి

నెల్లూరు నగర మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా గుర్రం రవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 19వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. రవి గతంలో భువనగిరి, మందమర్రి తదితర ప్రాంతాల్లో పనిచేశారు. జిహెచ్ఎంసిలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన రవి కృష్ణాజిల్లాలోని తిరువూరు ప్రాంతానికి చెందినవారు.

## నాల్గవ నగరానికి సీతయ్య

నెల్లూరు నాల్గవనగర సిఐగా సీతారామయ్య బాధ్యతలు చేపట్టారు. స్పెషల్ బ్రాంచ్‌లో వున్న సీతయ్యను ఇక్కడకు బదిలీ చేసి, ఇక్కడ సిఐగా వున్న మాణిక్యాలరావును స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

## ఎండా... వాన

జిల్లాలో తరచూ వర్షాలు పడుతున్నాయి. దాదాపు తాగునీటి కొరత తీరినట్లే. మొన్న ఆదివారం రాత్రి అయితే నెల్లూరులో ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడింది. ఈమధ్యకాలంలో నెల్లూరులో పెద్ద పెద్ద వర్షం అదే! వానలు కురుస్తున్నాయని చెప్పి ఎండలు ఆగలేదు. ఎండల పాటికి ఎండలు కూడా బాగానే కాస్తున్నాయి.

## మార్కెట్ రోడ్డు దరిద్రం

నెల్లూరులోని ఏసి కూరగాయల మార్కెట్ ముందురోడ్డు దరిద్రంగా వుంది. గుంతలమయంగా వుంది. ఇక్కడ మార్కెట్ కావడంతో ట్రాఫిక్ రద్దీగా వుంటుంది. ఇక్కడో రోడ్డు గుంతలు పడి ఉండడంతో ఈ దారినపోయే వాహనాలు నిదానంగా వెళ్లాల్సి రావడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

## పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఫైర్

నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని పోలీసు అతిథిగృహంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. గెస్ట్ హౌస్‌లో మెట్లక్రింద ట్రాన్స్‌ఫార్మర్ వుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. మూడు ఏసిలు కాలిపోయాయి. దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేసారు.

## మళ్ళీ నెల్లూరుకు రామిరెడ్డి



నెల్లూరుజిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బి.రామిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయం ఇఓగా వున్నారు. గత నెలలోనే ఆయనను నెల్లూరుకు బదిలీచేసినా ఉత్తర్వులు వెలువడలేదు. ఇప్పుడు ఉత్తర్వులు రావడంతో బదిలీ షురూ అయ్యింది. 'చంటిగాడు లోకల్' అన్నట్లు రామిరెడ్డిది గుంటూరు జిల్లా అయినా నెల్లూరులో స్థానికుడు లెక్క. ఈ జిల్లాతో సుదీర్ఘ అనుబంధం ఆయనది. ఎమ్మార్వోగా, డిఆర్‌ఓగా, జడ్పీ సిఇఓగా వివిధ హోదాలలో ఎక్కువకాలం పనిచేసాడు. తన బిడ్డల పెళ్ళిళ్ళు కూడా ఇక్కడే చేసాడు. కాబట్టి నెల్లూరంటే ఆయనకు ఎనలేని అభిమానం. రిటైరయ్యే స్టేజ్‌లో మళ్ళీ నెల్లూరుకే వచ్చాడు.

## వైద్యవిద్యార్థికి అరుదైన చికిత్స



నెల్లూరు సింహపురి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య విద్యార్థికి ఆసుపత్రి వైద్యులు అరుదైన వైద్య చికిత్స చేసి అతని ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా మంగళవారం ఆసుపత్రి వైద్యులు విలేకర్లతో మాట్లాడుతూ చిత్తూరుజిల్లా ఏర్పేడుకు చెందిన పవన్ వైద్యవిద్య మొదటి సంవత్సరం చదువుతున్నాడని అయితే అతను కదలలేని జీబీసిండ్రోమ్(నరాల బలహీనత) జబ్బుతో బాధపడుతున్నాడన్నారు. అతని పనులు అతను చేసుకోలేని స్థితిలో కేవలం మాట్లాడడం, చూడడం తప్ప జీవచ్ఛవంలా ఉన్నాడని, దీంతో అతని కుటుంబసభ్యులు పవన్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు సింహపురి ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. ఎటువంటి శస్త్ర చికిత్సలు లేకుండానే కేవలం మందులతోనే మెరుగైన వైద్య సేవలందించడంతో 5రోజుల తర్వాత పవన్ ఆరోగ్యంగా కోలుకున్నాడని తెలిపారు. ఇటువంటి జబ్బు అరుదుగా వస్తుందని, నిర్లక్ష్యం చేస్తే రోగికి ప్రమాదమని తెలిపారు. నగరాల్లో ఇలాంటి వైద్యం చేసేందుకు దాదాపు రూ.10లక్షల నుంచి 15లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. మొట్టమొదటిసారిగా సింహపురి ఆసుపత్రిలో జీబి సిండ్రోమ్ జబ్బుకు వైద్య చికిత్సను అందరికి అందుబాటులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ నరాల వైద్య నిపుణులు డాక్టర్ సుజయ్‌సదా, డాక్టర్ శ్రీనివాస్, వైద్యవిద్యార్థి పవన్ పాల్గొన్నారు.

## ఏసి వాకర్స్ వైద్య అవగాహన సదస్సు



ఈ నెల 20న నెల్లూరులోని ఏసి స్టేడియంలో ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వాళ్ళు మెదడు, నరముల వ్యాధులకు సంబంధించి ఒక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ న్యూరోఫిజీషియన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఈ కార్యమంలో పాల్గొని మెదడు, నరాల వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. వాకర్స్ సందేహాలకు ఆయన సవివరంగా సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చిన్న సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసకుమార్, కార్యదర్శి బి.శేషగిరిరావు, కోశాధికారి నారాయణరావు, ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, ఎన్.రాఘవేంద్రశెట్టి, నలుబోలు బలరామయ్యనాయుడు, సురేష్‌కుమార్, వి.హజరత్‌బాబు, డాక్టర్ యం.యస్.రెడ్డి, డాక్టర్ దొరస్వామినాయుడు, అమరేంద్రరెడ్డి, రవిచంద్ర, జయదేవ్, బెజవాడ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల వివాదం

నగరంలో కట్టిన అధికారపార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించినందుకు కార్పొరేషన్ పట్టణ ప్రణాళికాధికారికి చీవాట్లు పడ్డాయి. 'రైతు కోసం చంద్రన్న యాత్ర'లో భాగంగా పెద్దఎత్తున మంత్రులకు స్వాగతం పలుకుతూ నగరంలో తెలుగు తమ్ముళ్ళు ఫ్లెక్సీలు కట్టారు. పర్మిషన్ లేకుండా కట్టిన వీటిని టిపిఓ తన సిబ్బంది చేత తొలగిస్తుండగా తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చూసారు. అరికాల్లో మండి వెంటనే కమిషనర్ మూర్తికి ఫిర్యాదు చేశారు. వెంటనే మూర్తి స్పందించి, అధికార కార్యక్రమాల ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారంటూ మందలించారు.


ఆహ్వానము
త్యాగరాజ భిక్షువు
శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి
విగ్రహావిష్కరణ సందర్భంగా
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు
విగ్రహప్రతిష్ఠాపన కమిటి గౌరవాధ్యక్షులు, "స్వచ్ఛభారత్" బ్రాండ్ అంబాసిడర్
శ్రీ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి సంయుక్త ఆధ్వర్యంలో
అక్టోబర్ 03, 2015 శనివారం సా॥ 4.00గం.ల నుండి
15వేల మందితో నెల్లూరు విఆర్‌సి మైదానం నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు
స్వచ్ఛ భారత్
అవగాహన ర్యాలీ
స్వచ్ఛ భారత్
పాడుతా తీయగా గాయనీగాయకులచే పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో
స్వచ్ఛ సంగీతం
ఈ కార్యక్రమంలో...
కేంద్ర మంత్రివర్యులు
శ్రీ యం. వెంకయ్యనాయుడు గారు
రాష్ట్ర మంత్రివర్యులు
శ్రీ పి.నారాయణ గారు
'పద్మభూషణ్' బిరుదాంకితులు
శ్రీ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారు
'పద్మభూషణ్' బిరుదాంకితులు
శ్రీ కమల్‌హాసన్ గారు
కళాతపస్వి, 'పద్మశ్రీ' బిరుదాంకితులు
శ్రీ కె.విశ్వనాథ్ గారు
నెల్లూరుజిల్లా కలెక్టర్
శ్రీమతి యం.జానకి గారు
మరియు పలువురు రాజకీయ సినీప్రముఖులు పాల్గొంటారు.
స్వచ్ఛ భారత్
అవగాహన ర్యాలీ
సాయంత్రం 4 గంటలకు 15వేల మందితో
విఆర్‌సి మైదానం నుండి బయలుదేరును.
స్వచ్ఛ సంగీతం
పాడుతా తీయగా గాయనీగాయకులచే
సాయంత్రం 5 గంటలకు
పోలీసు పరేడ్ మైదానంలో జరుగును.
అందరూ ఆహ్వానితులే
"స్వచ్ఛ సంగీతం"
ఉచిత ప్రవేశ పాసుల కొరకు దిగువ నంబర్ల నందు సంప్రదించగలరు.
94410 03505 || 97019 43216 || 99491 11776 || 83319 24924 || 94400 45541



# గూడూరు డివిజన్ వార్తలు

## బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందాలి



నూతనంగా ఎన్నికైన బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులను అభినందిస్తున్న ప్రతినిధులు

బ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య జిల్లా బాధ్యులు ఎస్.శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం బ్రాహ్మణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అప్పుడే నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అంది ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. వివిధ రంగాల్లోని ప్రముఖులను ఘనంగా సన్మానించారు. గూడూరు పట్టణం బ్రాహ్మణ సేవాసంఘాన్ని ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా శీకంఠి నాగరాజారావు, అధ్యక్షుడుగా యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షుడిగా నాథబ్రహ్మం, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, వెంకట నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు భువనేశ్వరప్రసాద్, వాసుదేవరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


### చిన్నతనం నుండే
## ఆరోగ్య నియమాలను పాటించాలి
**- ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

ఆరోగ్య నియమాలను చిన్నతనం నుంచి పాటిస్తే అన్ని విజయాలను సాధించవచ్చని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు రెండవ పట్టణంలోని సెయింట్ మేరీస్ చర్చి ప్రాంగణంలో సోమవారం ఉచిత బాడీ చెకప్ వైద్యశిబిరాన్ని కో-ఆర్డినేటర్ జాషువ నిర్వహించారు. పలువురు విద్యార్థులకు వైద్యసేవలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, చెంచురామయ్య, రమేష్, ఇజ్రాయిల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సమస్యలను పట్టించుకొనేవారే కరువయ్యారు



సబ్‌కలెక్టర్ గిరీషాకు సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

అయ్యా, ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాము, చిన్న పనికి రోజులు తరబడి కూలీ నాలీ వదులుకుని వస్తూ పోతున్నాం. పనులు కావడం లేదు. అధికారులు వస్తున్నారు, పోతున్నారు. పెద్దల పనులు మాత్రం వేగంగా అయిపోతున్నాయి. కనీసం పేదల సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారంటూ బాధితులు గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషాకు విన్నవించుకున్నారు. మండలంలోని అధికారులు కాలయాపన, పనులు చేయక పోవడంతో ప్రతివారం డివిజన్ కేంద్రమైన గూడూరుకు రాకపోకలకు కనీసం 200వరకు ఖర్చవుతుందని, పూట గడవడమే కష్టంగా మారిన తరుణంలో సమస్యలను వచ్చి చెప్పడం మరింత భారంగా ఉంటోందని వాపోయారు. కాగా, గూడూరు డివిజన్‌లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి యాదగిరి, పలువురు నాయకులు సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గూడూరు డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన అర్జీదారులు సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినానికి వచ్చి సబ్‌కలెక్టర్ ముందు వారి బాధలను తెలియజేశారు.

## భూవివాదాలు పరిష్కరించాలి

గూడూరు మండలంలోని పలు గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించాలని అర్జీదారులు తహశీల్దార్ సి.వెంకట నారాయణమ్మకు విన్నవించారు. తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు అర్జీదారులు అర్జీలను సమర్పించి పరిష్కరించాలని విన్నవించారు. గొల్లపల్లిలోని భూసమస్య కారణంగా వివాదం చోటు చేసుకుందని అధికారులు చొరవచూపి పరిష్కరించాలని నెర్నూరు సర్పంచి బుజ్జా నాగేశ్వరరావు తహశీల్దార్‌ను కోరారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన సమస్యలపై పలువురు నాయకులు వివరించారు.

### గూడూరులో
## సుదర్శన్ కౌంటర్
**- రామమోహన్‌రావు**



గూడూరులో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఎండోమెంటు వారి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు చదలవాడ కృష్ణమూర్తి సహకారంతో సుదర్శన్ కౌంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ అధ్యక్షులు శ్రీకంఠి రామమోహన్ రావు 'లాయర్'కు తెలిపారు. తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల అనంతరం ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

### శాకాంబరి అలంకారంలో
## గణనాథుడు



గూడూరు రెండో పట్టణం మాలవ్యా నగర్‌లోని వినాయకుడు సోమవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేకపూజలను ఘనంగా నిర్వహించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వైకాపా నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు వినాయకుడికి విశేష పూజలు చేశారు. అలాగే ఇందిరానగర్ ప్రాంతంలోని కళాకారులు మట్టితో విగ్రహాలను అపురూపంగా తీర్చిదిద్దారు. కాగా సిరామిక్ కాలేజీ దగ్గర గణేష్ నగర్‌లో వినాయకుడికి విశేష పూజలు జరిపి, భారీగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చెంచురామయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## దేవునికి సేవకులం



శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గురవయ్యనాయుడు, సభ్యులు, ఇ.ఓ. రామిరెడ్డి

స్వామి అమ్మవార్లకు భక్తితో సేవ చేసుకునే భాగ్యం దేవుడు మాకు కల్పించారని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు అన్నారు. ఇటీవల ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవునికి సేవ చేసే భాగ్యం అందరికీ కలగదు, ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు దేవునితో సమానమని వారికి సదుపాయాలందించే కూలీలుగా సేవ చేస్తామన్నారు. ఇప్పటికిప్పుడు సమస్యలు పరిష్కారాలు కావని, పరిపాలనలో మార్పు రావాలని, ఆ తర్వాత అంతా మార్పు తీసుకువస్తామన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో "గోవింద నామస్మరణ" వినిపించినట్లు... శ్రీకాళహస్తీశ్వరాలయంలో అడుగుపెట్టగానే "ఓం నమఃశివాయ" అనే నినాదం వినిపించేలా చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డికి తెలిపామన్నారు. కంచు గడప వద్ద విభూది లింగాన్ని ఏర్పాటు చేసి లోపలకు వెళ్ళేటప్పుడు భక్తులు నామాలు దిద్దుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. నాలుగు మాడా వీధుల్లో "ఓం నమఃశ్శివాయ" వినిపించేలా చేస్తామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహా కుంభాభిషేకానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు కాసరం రమేష్, పిఎం చంద్ర, సి.జయగోపాల్, బాలాజీ, లోకనాథం నాయుడు, నారాయణ యాదవ్, కండ్రిగ ఉమ, మల్లెమాల ప్రమీల, వెంకట్రామానాయుడు, వాకచర్ల గురప్పశెట్టి, మల్లిఖార్జున్ గౌడ్, మునిసిద్దయ్య, చెత్తమనాయుడు, సీతారామయ్యలు, ఎక్స్ అఫిషియో మెంబర్ కె. సంబంధ గురుకుల్, ఆలయాధికారులు ఇఇ వెంకట నారాయణ, ఎఇఓ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, ఎ.పి.ఆర్ఓ. నాగయ్య, పాలసరఫరా సంఘాధ్యక్షుడు మునిరాజానాయుడులు పాల్గొన్నారు.



బాబు అగ్రహారం వద్ద నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'శ్రీ కాలజ్ఞాన గణపతి'

## కాలజ్ఞాన గణపతి

శ్రీకాళహస్తి అంటేనే ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతను చాటుతూ వినాయక చవితి పండుగ రోజున బాబు అగ్రహారం వద్ద శ్రీ పోతులూరి వీరబ్రహ్మం ఆకృతిలో "శ్రీ కాలజ్ఞాన గణపతి"ని ఏర్పాటు చేశారు నవభారత్ యువజన సంఘం గరికపాటి రామచంద్రయ్య, గరికపాటి రమేష్‌లు. గతంలో విద్యుత్ పొదుపు, పర్యావరణ నివారణ, రైతు గణపతి, తపో: గణపతి, శంఖు గణపతి, శివగణపతి, ప్రళయ గణపతి, తుంబుర గణపతి, మత్స్యకార గణపతిలను తయారు చేసి పట్టణ ప్రజలను ఆకర్షితులను చేశారు. "శ్రీ కాలజ్ఞాన గణపతి"ని చూడడానికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల నుండి కూడా తరలివచ్చి చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి యేటా ఈ సంవత్సరం ఇక్కడ ఏ గణపతిని ఏర్పాటు చేస్తారోనని చాలా మంది భక్తులు ఉత్సాహంగా ఎదురు చూస్తుంటారు. ఈ సంవత్సరం కూడా గణపతిని వెంకటేశ్వర్లు శిల్పి తయారు చేశారు. కోగిల రవికుమార్ రూపకల్పన చేశారు. రెడ్డి ఆర్ట్స్ పెయింటింగ్స్ ఎలక్ట్రీషియన్ ఎస్.సుకుమార్, పి.బాలసుబ్రమణ్యం, కళాకారుడు పర్యవేక్షణలో కోనేటి విజయకుమార్ సహాయకులుగా పని చేశారు. వచ్చిన భక్తులందరికి తీర్థ ప్రసాదాలను అందించారు.

## మంత్రి సతీమణి బృందమ్మ తనిఖీలు

శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన మండపాన్ని బుధవారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ తనిఖీ చేశారు. ప్రతి భక్తుడిని, భక్తురాలిని భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

అదేవిధంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో కూడా ఆమె తనిఖీలు నిర్వహించారు. అక్కడ వారికి పెట్టే ఉచిత భోజనం కూడా రుచి చూశారు. రోగుల పట్ల డాక్టర్లు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు? వారికి ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు ఉప్పుడి బియ్యం వడ్డించడంపై సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. ఇక మీదట రోగులకు భోజనం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి పంపిణీ జరుగుతుందన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. అవసరాలకు డబ్బు సర్దుబాటు అవుతుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. వ్యాపార వర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించిన ఆదాయం ఉండదు. వృత్తి పరంగా సంపాదన బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం, కొత్త వస్తువులు యంత్రపరికరాలు సమకూర్చుకొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, బాకీలు కొంత వరకు దొరకడం ఉంటుంది. ఉద్యోగులకు మంచి సామర్థ్యము, గుర్తింపు గౌరవాలుంటాయి. కృషి, పట్టుదలతో అనుకున్న పనులు సాధిస్తారు. వృత్తి వ్యాపార రంగాల వారికి మంచి అవకాశాలు దొరుకుతాయి. వ్యవహారాలు సొంతంగా చూచుకొనడం మంచిది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయం కాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు కేసులలో అనుకూలత ఉంటుంది. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. పొగడ్తలు, మొగమాటాలకు, హామీలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, ఆదాయం పెరగడం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కాంట్రాక్టు పనులు చురుకుగా సాగుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

సోదరవర్గానికి మంచి జరుగుతుంది. అధికారులకు స్థాన చలనం ఉండవచ్చును. ఆదాయ వ్యయాలు సమతూకంలో ఉంటాయి. ఆర్థిక విషయాలలో ఆలోచనలు అంచనాలు ఫలించగలవు. బంధుమిత్రులతో సత్సంబంధాలుంటాయి. ఉద్యోగులకు వత్తిడి పనిభారం ఎక్కువగా వుంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరిగిపోతాయి. చిన్న వ్యాపారులకు లాభాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధుముఖ్యులకు, మీకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. పంతాలు పట్టుదలకు పోకుండా సమస్యలను పరిష్కరించుకొనండి. ఖర్చులు అదనంగా పైనబడగలవు. దూరప్రయాణాలు జరుగును. ఆస్థి వ్యవహారాలు కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ముఖ్యమైన పత్రాలు నోటీసులు అందుకుంటారు. ఉద్యోగావకాశాలలో జాప్యం జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు శ్రమ ఎక్కువుగా వుంటుంది. దూర ప్రయాణాలలో చికాకు పడతారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావడం జరుగుతుంది. చేస్తున్న పనులు ఆలస్యంగా జరుగుతూ టెన్షన్ పెడతాయి. వ్యాపారులపై అధికారుల చర్యలుండవచ్చును. బిడ్డల విద్యా, పాలనా వ్యవహారాలలో ఇబ్బందులు పడతారు. దర్పాలకు విలాసాలకు బాగా ఖర్చులుంటాయి. ఆదాయములుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 25.09.2015 నుండి**
**తేది. 01.10.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో తేది 29 వరకు శుక్రుడు, పిదప సింహంలో శుక్రుడు, సింహంలో కుజగురువు, కన్యలో రవి బుధ రాహువులు, వృశ్చికంలో శని, కుంభమీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 27 ఆదివారము అనంతపద్మనాభ వ్రతము.
తేది 28 సోమవారము మహాలయపక్ష ప్రారంభము.
ముహూర్తములు లేవు.

### భాద్రపద మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | ద్వాదశి | సా॥ గం.3.45వ॥ |
| తేది. 26 | శని | త్రయోదశి | ప॥ గం.1.40వ॥ |
| తేది. 27 | ఆది | చతుర్దశి | ప॥ గం.11.23వ॥ |
| తేది. 28 | సోమ | పూర్ణిమ | ఉ॥ గం.9.0వ॥ |

### భాద్రపద మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | మంగళ | పాడ్యమి | ఉ॥ గం.6.33వ॥ |
| | పిదప | విదియ | రా॥ గం.4.10వ॥ |
| తేది. 30 | బుధ | తదియ | రా॥ గం.1.53వ॥ |
| తేది. 01 | గురు | చతుర్థి | రా॥ గం.1.51వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధువులతో సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో బేధాభిప్రాయాలుంటాయి. ముఖ్య విషయాలపై అయినవారితో సంప్రదింపులుంటాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. వ్యాపార వర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. అధికారులకు స్థానమార్పులు, నిరుద్యోగులకు అవకాశాలుంటాయి. కళా సాహిత్య క్రీడా సాంకేతిక వర్గాలకి అవకాశాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పెండింగ్‌లో గల పనులు అనుకూలము కాగలవు. ఆదాయం బాగుంటుంది. బంధుమిత్రులకు సహాయ పడతారు. కోర్టు వ్యవహారాలు, ప్రభుత్వ అనుమతులు సానుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి ఆర్థికావకాశాలు దొరకడం, కొత్త పెట్టుబడులు పెట్టడం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

గృహ వస్తు వాహన రిపేర్లు ఉంటాయి. కుటుంబ సభ్యుల అనుకూలత మీకు సరిగా ఉండదు. శరీరానికి గాయాలు తగలకుండా జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. కంపెనీ మీటింగులకు, యూనియన్ సమావేశాలకు హాజరు కాగలరు. వస్తువులు, ముఖ్య పత్రాలు, డబ్బు పోగొట్టుకొనకుండా జాగ్రత్త పడండి.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

విందులు, వేడుకలు, సభలు సమావేశాలలో పాల్గొంటారు. చేసే పనులు ప్రోత్సాహకరంగా సాగినా ఆలస్యం కాగలవు. నిర్దుష్టమైన ప్రణాళికలతో ఆర్థికాభివృద్ధికి ప్రయత్నిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అయితే విలాసములకు, పలుకుబడి పెంచుకొనడానికి ఖర్చులు ఎక్కువ పెట్టుతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

నిర్వహణ సామర్థ్యం బాగుండినా ఫలితం సరిగా ఉండదు. స్థిరాస్తుల వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు తృప్తికరంగా ఉండవు. వృత్తి వ్యాపారాలలో సరైన అవకాశాలు దొరకక ఆదాయం తగ్గుతుంది. బంధువులతో విభేదాలు చోటు చేసుకుంటాయి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. శరీరానికి గాయాలు తగలవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూల అవకాశాలుంటాయి. ప్రభుత్వం నుండి రావలసిన డబ్బు, బాకీలు, అనుమతులు ఆలస్యం కాగలవు. ఉరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. వృత్తి వ్యాపారాలలో కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతారు. కళా క్రీడా శాస్త్ర సాంకేతిక వర్గాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

# అండర్‌బ్రిడ్జిలలో చేపల పెంపకం

శ్రీను గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి గాంచిన నెల్లూరు నగరం. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మేయర్ అబ్దుల్ అజీజ్ ఏదో ఆలోచిస్తూ విచారంగా కూర్చుని ఉన్నాడు. ఆయన ఎదురుగా కె.లక్ష్మీసునంద, పి.శైలజ, లేబూరు పరమేశ్వరరెడ్డి, కిన్నెర ప్రసాద్, నూనె మల్లిఖార్జునయాదవ్, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, దాసరి రాజేష్, మేకల రజని, వెంకయ్యయాదవ్ వంటి కార్పొరేటర్లు కూర్చునివున్నారు. అప్పుడే అక్కడకు వాయిస్ ఆఫ్ ద సిటీ, గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వచ్చాడు. రావడంతోటే ఒక అర్జీ మేయర్ చేతిలో పెట్టి... సార్, బుజబుజనెల్లూరులో శ్మశానవాటికను కార్పొరేట్ హంగులతో నిర్మించాలి, శ్మశానవాటికను ఉద్యానవనం లాగా తీర్చిదిద్దాలి. వచ్చిన మృతుల బంధువుల గుండెల్లో నుండి విషాదాన్ని తొలగించే విధంగా అక్కడి వాతావరణం అమరాలి. దీని కోసం నిధులు మంజూరు చేయండని అడిగాడు. అది విన్న అజీజ్... భలేవారా్సర్, ఇక్కడ బతుకున్నోళ్లకు పనులు చేయడానికే నిధులు లేవు, ఇక చనిపోయినవాళ్ల కోసం నిధులు ఎక్కడి నుండి తేగలం అని అన్నాడు. వెంటనే కోటంరెడ్డి... అలా అనకండి సార్, భూమ్మీద ఉన్నోళ్లు ఎలాగోలా బ్రతికేస్తారు, కాని చనిపోయినవాళ్లు దేవుళ్లతో సమానం. శ్మశానాలు మన పూర్వీకులు కొలువైన పవిత్ర స్థలాలు, వాటిని నిర్లక్ష్యం చేయకండి, అయినా అంత నిధుల కొరతేంటి, మీరెందుకంత నీరసంగా ఉన్నారని అడిగాడు. ఏం చెప్పమంటారా్సర్... ఈ పత్రికలు చూడండి... 'ఈ నగరానికి ఏమైంది' అని ఒకరు, 'నెల్లూరులో మనుషుల కంటే జంతువుల సంఖ్యే ఎక్కువ' అని ఇంకొకరు, 'ఇవి రోడ్లా.. వాటర్ షెడ్లా' అంటూ మరొకరు హెడ్డింగ్‌లు పెట్టి వార్తలు వ్రాసారు. వాళ్లకేం తెలుసు మనం పడే బాధలు. కార్పొరేషన్‌లో వున్న నిధులు జీతాలకు, పైపై ఆర్భాటాలకు సరిపోతున్నాయి. ఇక మిగిలిన పనులు చేయడానికి నిధులెక్కడివని అజీజ్ అన్నాడు. అప్పుడు కోటంరెడ్డి... నిధులు లేవని నీరసంగా పడుకోవడం కాదు అజీజ్, ఆ నిధులను సంపాదించే మార్గాలను వెదకాలి.. నీలాగా నేనూ ఆలోచించి నీరసంగా పడుకుని వుంటే ఈరోజు జనంలో నేను తిరగ్గలిగేవాడినా? మనసుంటే మార్గాలు బొచ్చెడుంటాయి. నిధులు ఎలా రాబట్టాలో ఆలోచించండి అని సలహా ఇచ్చాడు. ఆ బొచ్చెడు మార్గాలేవో మీరే చెప్పి పుణ్యం కట్టుకోండని వెంటనే అజీజ్ అడిగాడు. కోటంరెడ్డి చెప్పడం మొదలు పెట్టాడు. చిన్న స్క్రిప్ట్‌తో బాహుబలి సినిమా తీసి రాజమౌళి 600కోట్ల కలెక్షన్ రాబట్టాడు. మేమంతా స్క్రిప్ట్ రైటర్లమే... అలాంటి సినిమా ప్లాన్ ఏదన్నా చేయండి, పెట్టుబడి మీరు పెట్టండి, వచ్చిన ఆదాయంలో పెట్టుబడి, వడ్డీ తీసేసి మిగతా ఆదాయం కార్పొరేషన్ ఖాతాకు జమ చేయండి... అని చెబుతుండగా, అజీజ్ జోక్యం చేసుకుని, సినిమా తీయాలంటే మాటలా... హీరో హీరోయిన్లు, యాక్టర్లందరికీ డబ్బులివ్వాలిగా అని అడిగాడు. మన డబ్బులతో మనం సినిమా తీసుకుంటూ ఎవరికో డబ్బులిచ్చి యాక్టర్లుగా పెట్టుకోవడమెందుకు... ఎలాగూ మన కార్పొరేటర్లందరూ ఖాళీగా వున్నారు. తలా ఒక క్యారెక్టర్ ఇద్దాం. స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకన్న(64+)కు సినిమాల్లో నటించాలని ఎప్పట్నుండో ఆసక్తి... ఈయనను కూడా నటించమని అడుగుదాం. ఇక నా సంగతి అంటారా... హీరోకైనా రెడీ... విలన్‌కైనా ఓకే... అయితే క్యారెక్టర్ లెంగ్త్ తగ్గకూడదు. నాకు ఒక్క పైసా పల్లేదు, నీ కోసం ఆ మాత్రం ఫ్రీగా చేయలేనా... అజీజ్ అని కోటంరెడ్డి చెప్పాడు. సినిమా యాక్షన్ అవకాశం అనగానే అక్కడున్న కార్పొరేటర్లందరూ కూడా తమలోని నటనా ప్రతిభను వెండితెర మీద చూసుకునే అవకాశం రాబోతుందని మనసులో అనుకుంటూ ఆనందపడుతుంటే... అజీజ్ మాత్రం వెంటనే కోటంరెడ్డి రెండు చేతులు పట్టుకుని... నేను నీకు ఏం అన్యాయం చేసానన్నా... నా మీద ఇంత కక్ష కట్టి ఉన్నావ్, నువ్వు అడిగిన పనల్లా చేస్తూనే వున్నా కదా.. మరి ఎందుకు వీళ్లను పెట్టి నా చేత సినిమా తీయించాలనుకుంటున్నావ్... అంటూ దాదాపు ఏడుపు ముఖం పెట్టి అడిగాడు. లేదులే అజీజ్... నీ మీద నాకెందుకు కక్ష చెప్పు... రాజమౌళి 'ఈగ'ను పెట్టి సినిమా తీసి హిట్ చేయగా లేనిది మనం మన కార్పొరేటర్లను పెట్టి తీసి హిట్ చేయలేమా? అని కోటంరెడ్డి సముదాయించాడు. సినిమా ఆలోచన వద్దుగాని... మనకు సెట్ కాదు, ఇంకేమన్నా ఐడియా ఉంటే చెప్పండని అజీజ్ అడిగాడు. అప్పుడే అక్కడకు ఆనం వివేకా వచ్చాడు. ఏంటి అజీజ్ భాయ్... ఐడియా అంటున్నావ్, అని వివేకా అడిగాడు. అజీజ్ తన బాధంతా చెప్పాడు. అప్పుడు వివేకా... వూరి నిండా కుక్కలు ఉన్నాయి. ఫిలిప్పిన్స్, మెక్సికో, థాయ్‌లాండ్‌లలో ఈ కుక్కలకు బాగా డిమాండ్. కుక్కల ఎగుమతిపై ఆ దేశాలతో ఒప్పందం చేసుకుందా... నగరం నిండా వేలటన్నుల దోమలున్నాయి. చైనా, జపాన్ వాళ్లను గ్లోబల్ టెండర్ల ద్వారా ఆహ్వానిద్దాం. దోమలను ఆ దేశాలకు అమ్ముకుంటే వందలకోట్ల ఆదాయం వస్తుంది. ఇప్పుడు వర్షాకాలం. నెల్లూరులో నాలుగు బాక్స్ టైప్ బ్రిడ్జిలున్నాయి. జనవరి దాకా ఆ బ్రిడ్జిలలో నీళ్లు నిలిచే వుంటాయి. కాబట్టి రొయ్యలు, చేపల పెంపకం చేపడదాం, అదీగాక ఈ బ్రిడ్జిల వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బోట్లు పెడదాం... ప్రజలను అటూ ఇటూ దాటించడానికి ఛార్జీలు వసూలు చేద్దాం. నెల్లూరు రోడ్ల మీద ఆవులు మందలు మందలుగా వున్నాయి. వాటన్నింటిని ఒక దొడ్డిలో కట్టేసి పాల వ్యాపారం కూడా మొదలుపెడదాం... నగరంలో కార్పొరేషన్ స్థలాలు చాలా ఖాళీగా వున్నాయి. వాటిలో మనమెలాగూ పార్కులు, కమ్యూనిటీ హాళ్లు కట్టేది లేదు, పెట్టేదీ లేదు. ఎవడో ఒకడు ఆక్రమించుకుని షాపులు కడతాడు, మనం చచ్చినట్లు రెగ్యులైజ్ చేస్తుంటాం. దీనికి బదులు ఖాళీగా వున్న ఆ స్థలాలను మీరే అమ్మకానికి పెట్టండి, దండిగా డబ్బులొస్తాయి. నగరంలో మనం పెంచుతున్న దోమలు, పందులు వల్ల రోగాలు ప్రబలి ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డాక్టర్లు ఆర్థికంగా లాభపడ్డారు. కాబట్టి వీటన్నింటి మీద అన్‌హెల్త్ టాక్స్ పేరుతో స్పెషల్ టాక్స్ వేయండి... మనం వీళ్లకు ఎంతో చేస్తున్నప్పుడు, వీళ్లు కార్పొరేషన్‌కు ఆ మాత్రం చేయలేరా? అన్నింటికి మించి ఈమధ్య నగరంలో మొబైల్ టిఫిన్స్ బాగా జరుగుతున్నాయి. కార్పొరేటర్లను ఎవరి డివిజన్ లలో వాళ్లు ఈ టిఫిన్ సెంటర్లు పెట్టి కార్పొరేషన్‌కు ఆదాయం జమ చేయాలని చెప్పండి అని చెప్పాడు. ఆ మాటతో అక్కడున్న కార్పొరేటర్లందరూ... మాకు పని వుంది ఇక వస్తాం అంటూ లేచారు. అజీజ్ వుండి... మనం వ్యాపారాలు చేయకుండా కార్పొరేషన్‌కు నిధులొచ్చే మార్గాలేమీ లేవా అని అడిగాడు. ఉంది... అని వివేకా అన్నాడు. ఏంటది అని అజీజ్ ఆతృతగా అడిగాడు. వెంటనే వివేకా... రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని ఏ.సి స్టేడియం, విఆర్‌సి, సర్వోదయ, సెయింట్ పీటర్ స్కూల్ వంటి గ్రౌండ్‌లు అమ్మకానికి పెడితే సరి... అంటూ లేచాడు.



'అమ్మ ఫర్నిచర్' అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డికి అవార్డునందజేస్తున్న అతిథులు

## గ్రాండ్‌గా జేసీస్‌డే

నెల్లూరు ఇందిరాభవన్‌లో జేసీఐ ఆధ్వర్యంలో గ్రాండ్‌డే వేడుక మంగళవారం వేడుకగా నిర్వహించారు. జేసీస్ వారోత్సవాల్లో భాగంగా విశిష్ట వ్యక్తులను సన్మానించారు. జేసీ మాజీ అధ్యక్షులు మద్దాలి రామకృష్ణకు కమల్‌పత్ర అవార్డును ప్రదానం చేశారు. టాయ్‌అవార్డులను నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కోరెం ప్రవీణ్‌కుమార్, ముక్కుతో మురళీగానం చేసే సాయిహేమంత్‌కృష్ణ, పాడుతాతీయగా ఫేం సర్వేపల్లి శ్రేయకు అందజేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులకు అందించే టోబిప్ అవార్డులను సెయింట్‌పీటర్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.ఆంథోనిరెడ్డి, అమ్మ ఫర్నీచర్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, గాయకుడు గుండాల గురవయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జేసీస్ గౌరవ సలహాదారులు జీఎల్ మనోహర్ కృష్ణమూర్తి, చింతల మధుబాబు, శరణ్‌కుమార్, జేసీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రాజెక్ట్ ఛైర్మెన్ జనార్ధన్, ఉత్సవాల ఛైర్మెన్ తవ్వా శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎం.ఎస్.సుబ్బలక్ష్మి జయంత్యుత్సవాలు



ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి జయంత్యుత్సవాలు మంగళవారం నుండి మూడురోజుల పాటు నెల్లూరు టౌన్‌హాలులో వైభవంగా జరిగాయి. మొదటి రోజు చెన్నైకి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రసన్న వెంకటరాం గాత్రకచేరి ప్రేక్షకులను ఆనంద పరవశులను చేసింది. వయోలిన్‌పై మైసూరు శ్రీకాంత్, మృదంగంపై గణేష్‌లు వాయిద్య సహకారమందించారు. రెండవరోజు బుధవారం ప్రముఖ సంగీత విద్వాంసుడు డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యంను ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సి.మునికుమార్ 'విద్యాదాన కర్ణ' బిరుదును, శాలువాతో సత్కరించారు. అనంతరం గాయని సర్వేపల్లి శ్రేయ ఆలపించిన కీర్తనలు సభికులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై బి.యు.గణేష్‌పాత్రో, మృదంగంపై సతీష్‌కుమార్‌లు సహకారమందించారు. మూడవరోజు గురువారం ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థులచే డాక్టర్ యం.యస్.సుబ్బలక్ష్మి గానం చేసిన అంశములు, ప్రత్యేకనృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం చెన్నైకి చెందిన అమృత మురళి గాత్ర కచ్చేరి వీనుల విందుగా సాగింది.

ఈ మూడురోజులు స్థానిక కళాకారులు ఆలపించిన కీర్తనలు అలరించాయి. నృత్య పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పంచాగ్నుల వేంకట విశ్వనాథం, ఆలూరు శిరోమణిశర్మ, డా॥ సర్వేపల్లి అజయ్‌కుమార్, వై.నాగదేవిప్రసాద్, రేణిగుంట రాజశేఖర్, సురభి గాయత్రి, జి.సుభద్రాదేవి, సంగీత కళాశాల గురువులు, విద్వాంసులు, సంగీతాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ దాకా బార్లకు లైసెన్స్

బార్ల లైసెన్సుల గడువును అక్టోబర్ ఆఖరు దాకా పొడిగించారు. ఈ నెలాఖరుతో వీటి లైసెన్స్ గడువు ముగియనుండగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మరో నెల పొడిగించింది. జిల్లాలో 41బార్లున్నాయి. వీటిలో రెండు హోటళ్ళలోని బార్లకు ఇంకా గడువు ఉంది. నెల్లూరులో 30, కావలి 7, గూడూరులో 3, వెంకటగిరిలో 1 బార్‌లున్నాయి. వీటి నుండి మరో నెల లైసెన్స్ ఫీజును వసూలు చేయనున్నారు. కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం జనాభా ప్రాతిపదికన జిల్లాలో మరో 20బార్లు వచ్చే అవకాశాలున్నాయి.

### కాలధర్మం

## మూలంరెడ్డి బాల సరస్వతమ్మ



స్వర్గీయ మూలంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి సతీమణి శ్రీమతి సరస్వతమ్మ సెప్టెంబర్ 20వ తేదీ తన 83వ యేట కన్నుమూశారు. సరస్వతమ్మకు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె వున్నారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరు వెంకన్నపాళెం వీరి స్వగ్రామం. పెద్దకుమారుడు మూలం రామలింగారెడ్డి, రెండవ కుమారుడు వేణుగోపాలరెడ్డి(కోరా రాజగోపాలరెడ్డి వియ్యంకుడు), మూడవ కుమారుడు సుబ్బరామిరెడ్డి కాగా ఆమె కుమార్తె విద్యుల్లతమ్మ. అందరూ ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆమె మనుమడు సతీష్‌రెడ్డి(వేణుగోపాలరెడ్డి కుమారుడు) ఇన్‌కమ్‌టాక్స్ సంబంధిత కష్టమ్స్ విభాగంలో సీనియర్ స్థాయి కమిషనర్‌గా అత్యున్నత స్థానంలో ఢిల్లీలో తన విధులు నిర్వహిస్తూ గతంలో తన సేవలకు గుర్తుగా రాష్ట్రపతి అవార్డు కూడా అందుకున్నాడు. సరస్వతమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# జగన్ దీక్షను విజయవంతం చేయాలి



రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 26న తలపెట్టనున్న ఆమరణదీక్షను జయప్రదం చేయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు బిజెపి, టిడిపి వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో రాష్ట్రానికి సుమారు 10 సంవత్సరాలపాటు ప్రత్యేకహోదా కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే, ఇప్పుడు ఆ విషయమే ప్రస్తావించడం లేదని ఆయన విమర్శించారు. ప్రత్యేకహోదా సాధించుకుంటే భావితరాలకు మేలు జరుగుతుందని అన్నారు. ప్రత్యేకహోదా గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుకుమార్‌రెడ్డి, అధికారప్రతినిధి సురేష్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు, ఫ్లోర్‌లీడర్ కె.వెంకటనారాయణతో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# స్వర్ణాంధ్ర సాధనకు కృషిచేయాలి

**- బీదా మస్తాన్‌రావు**



స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషిచేస్తున్నారని, ఆ కృషిలో మనమంతా భాగస్వాములం కావాలని, అందుకు అందరం కలిసి కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు బీదా మస్తాన్‌రావు అన్నారు. కావలిలోని టిడిపి కార్యాలయంలో ఇటీవల ఆయన నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ త్రాగునీరు, వంట గ్యాస్, నాణ్యమైన విద్యుత్, రోడ్డు మార్గాలు, సామాన్యులకు సత్వర సమాచారం వగైరా సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషిచేస్తున్నారన్నారు. వీటికి అర్హులైనవారిని గుర్తించి జాబితా సిద్ధం చేయాలని కోరారు. వీటిని మండల కమిటీల్లో చర్చిస్తే నియోజకవర్గస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కమిటీ దృష్టికి తీసుకువెళ్ళి ఆ సౌకర్యాలు కలుగజేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పింఛన్లు, రుణమాఫీ, దీపం పథకం తదితర పథకాలు అందని లబ్దిదారులను గుర్తించాలన్నారు. నియోజకవర్గానికి ఎస్‌సి,ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 4.50 కోట్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్దిదారులకు వాటిని మంజూరుచేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఎంపిపి మహేశ్వరి, పట్టణ టిడిపి అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా, మండల అధ్యక్షులు పి. రంగారావు , నాయకులు రాంప్రసాద్, బ్రహ్మయ్య, శ్రీహరినాయుడు, కిషోర్, ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి సంబరాలు



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కావలి పట్టణంలోని పలు కూడళ్ళలో వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. అనేక రూపాల్లో వున్న వినాయక విగ్రహాలను ఈ సందర్భంగా ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహించారు. అందరికీ ఎంతో ప్రీతిపాత్రమైన విఘ్నేశ్వరుని ప్రత్యేక పూజలు చేసి, అందరూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కలుగోళమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం అందరినీ బాగా ఆకట్టుకుంది. ఆదివారం 9వ వార్డు కౌన్సిలర్ బిట్లగుంట శివ ఈ వేడుకల్లో పాల్గొని, పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ టిడిపి అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా ప్రారంభించగా, కావలి డిఎస్పీ రాఘవరావు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిరణ్, శ్రీనివాసులు, మల్లికార్జున, టిడిపి నాయకులు వెంకట్రావు, జి. వెంకటేశ్వర్లు (జివి) వల్లెపు కిషోర్, ఎస్. రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ వైద్యుని సేవలు మరువలేనివి

**- ప్రముఖ నటులు గొల్లపూడి మారుతీరావు**

మోకాళ్ళనొప్పులకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకునేందుకు తాను చెన్నై వెళ్ళగా, అక్కడ విజయహాస్పిటల్‌లోని ఎముకలు, కీళ్ళ వైద్యవిభాగం అధిపతి డాక్టర్ రాజశేఖరరెడ్డి తనపై చూపిన శ్రద్ధ, ఆదరణ మరువలేనిదని ప్రముఖ నటులు, రచయిత గొల్లపూడి మారుతీరావు పేర్కొన్నారు. గత కొద్దికాలంగా తాను మోకాళ్ళనొప్పులతో బాధపడుతున్నానని, అయితే చెన్నైలోని విజయ ఆసుపత్రిలో అత్యాధునిక చికిత్స ద్వారా కృత్రిమ మోకాలిచిప్పలను అమర్చారని, ఆ మరుసటి రోజే తాను చక్కగా నడవగలిగానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆ డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి కావలికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్యులు లక్ష్మీనరసారెడ్డి కుమారుడు కావడం గమనార్హం.

# అక్టోబర్ 3న సాంబమూర్తి విగ్రహావిష్కరణ, 'స్వచ్ఛభారత్' ర్యాలీ మరియు 'స్వచ్ఛసంగీతం'

# తొలిసారిగా నెల్లూరుకు... కమల్‌హాసన్

***ఆ రాష్ట్రం ఈ రాష్ట్రం అని కాకుండా, ఆ భాష, ఈ భాష అని తేడా లేకుండా అన్ని రాష్ట్రాల వారు, అన్ని భాషల వారు మా భారతీయ నటుడు అని గర్వంగా చెప్పుకోదగ్గ సినీనటుడు పద్మభూషణ్ బిరుదాంకితులు కమల్‌హాసన్ అక్టోబర్ 3వ తేదీన నెల్లూరుకు రానున్నారు.***

తమ తండ్రి "త్యాగరాజ భిక్షువు" శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి విగ్రహావిష్కరణ సందర్భంగా నెల్లూరీయులకు ఒక మంచి కార్యక్రమాన్ని అందించాలనే లక్ష్యంతో "స్వచ్ఛభారత్" అవగాహన ర్యాలీతో పాటు "పాడుతా తీయగా" గాయనీగాయకులచే "స్వచ్ఛ సంగీతాన్ని" అందించబోతున్నాడు. యస్.పి.బాలసుబ్రహ్మణ్యం.

ప్రముఖ సినీ నేపధ్యగాయకుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, గత యాభైయేళ్ళ కాలంలో యాభై అయిదు వేలకుపైగా వివిధ భాషలలో తన గాత్రాన్ని వినిపించిన నెల్లూరీయుడు యస్.పి.బాల సుబ్రహ్మణ్యం. తాను "స్వచ్ఛభారత్" బ్రాండ్ అంబాసిడర్ కావడంతో తన జన్మభూమి నుండే ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలనే ధ్యేయంతో నెల్లూరులో అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

త్యాగరాజ భిక్షువుగా, హరికథకుడిగా యాభై సంవత్సరాల క్రితమే దక్షిణ భారతదేశమంతా ప్రసిద్ధిగాంచిన తన తండ్రి సాంబమూర్తి గారి విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని తనకు జన్మనిచ్చిన వ్యక్తికి ఘననివాళిగా తాను జన్మించిన గడ్డపై చిరస్మరణీయమైన కార్యక్రమాన్ని ఆయన తలపెట్టారు.

అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం సుమారు 4గంటలకు నెల్లూరు వి.ఆర్ హైస్కూల్ మైదానం నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు చదువుకునే దాదాపు 15వేల మంది కాలేజీవిద్యార్థినీవిద్యార్థులతో "స్వచ్ఛభారత్" అవగాహన ర్యాలీని నిర్వహించడంతో పాటు పోలీస్ పరేడ్ మైదానంలో "పాడుతాతీయగా" గాయనీ గాయకులచే "స్వచ్ఛసంగీతం" కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.

## పాల్గొననున్న ప్రముఖులు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు సాంబమూర్తి గారి విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సంయుక్తంగా శ్రీ బాలసుబ్రహ్మణ్యం గారి నేతృత్వంలో జరిపే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు వెంకయ్యనాయుడు గారితో పాటు రాష్ట్రమంత్రి నారాయణ, ప్రముఖ సినీనటులు "పద్మభూషణ్" బిరుదాంకితులు కమల్‌హాసన్, 'కళాతపస్వి', 'పద్మశ్రీ' బిరుదాంకితులు కె.విశ్వనాథ్, నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకితో పాటు పలువురు సినీనటులు రాజకీయ ప్రముఖులు పాల్గొంటారు.

కమల్‌హాసన్ తొలిసారిగా నెల్లూరుకు విచ్చేయడం ఈ కార్యక్రమానికి ఓ ప్రత్యేక ఆకర్షణ కాబోతుండడం ఓ విశేషం. అంతేకాకుండా కమల్‌హాసన్ కూడా స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ కావడం మరో విశేషం.

"స్వచ్ఛభారత్"పై యస్.పి.బాలసుబ్రహ్మణ్యం రూపొందించిన పాటల సీడీని ఈ కార్యక్రమంలో విడుదల చేయడంతో పాటు సాంబమూర్తి గారిపై 'లాయర్' వారపత్రిక రూపొందించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తారు.

## పాసులు తీసుకోవాలి

పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే కార్యక్రమాలను 15వేల మందికి పైగా తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముందువరుసలలో కూర్చుని తిలకించాలనుకునేవారు 94410 03505, 97019 43216, 99491 11776, 83319 24924, 94400 45541 నెంబర్లలో సంప్రదించి ఉచిత పాసులు తీసుకోవాలి. పాసులు లేనివారు సైతం వెనుక వరుసలలో కూర్చుని కార్యక్రమాన్ని చూసి ఆనందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## అక్టోబర్ 4న హరికథ

ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 4న తన తండ్రికి అత్యంత ఇష్టమైన "హరికథా గానాన్ని" యస్.పి.బాలసుబ్రహ్మణ్యం నెల్లూరు టౌన్‌హాల్ (పుర మందిరం)లో ఏర్పాటు చేయనున్నారు. ప్రముఖ హరికథా కళాకారులు, శ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి, గుంటూరు, గారిచే అక్టోబర్ 4వ తేదీ ఆదివారం సాయంత్రం 6గంటల 5నిముషాల నుండి ఈ కార్యక్రమం జరుగనుంది.

ఈ అరుదైన కార్యక్రమంలో నెల్లూరీయులంతా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జరిగిన పత్రికా విలేకర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మరియు కమిటీ సభ్యులు కోరారు.

# మళ్ళీ కిరీటం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ తలనొప్పి నాకెందుకులే అనుకుని ప్రసన్న వదిలించుకున్నాడు. కాని, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనేవాడు లేకుంటే పరువుపోదా? పార్టీ ప్రతిష్ఠ ఏం కావాలి? అందుకే అధిష్ఠానం వెదికివెదికి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికే ఈ బాధ్యతలు కట్టబెట్టింది. 2014 ఎన్నికలకు ముందు కాకాణియే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా వున్నాడు. కలెక్టర్ బంగ్లా సమీపంలో పార్టీ ఆఫీసును పెట్టి ఆయనే లాక్కొస్తుండినాడు. అయితే మేకపాటి సోదరులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తప్పుకునేలా చేసి తమ అనుచరుడైన మేరిగ మురళీని అధ్యక్షుడిని చేసారు. ఎన్నికల తర్వాత మురళీని తప్పించి ప్రసన్నకు అప్పగించారు. ఆయన మొన్నటి వరకు బలవంతంగా లాక్కొచ్చారు. ఇక లాగలేక వదిలేసారు. ఈ పరిస్థితుల్లో కాకాణి అయితేనే అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు నడుపుతాడనే ఉద్దేశ్యంతో పార్టీ అధ్యక్షుడిగా మళ్ళీ ఆయననే ఎంపిక చేసారు.

# నదుల అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

హయాంలోనే కాలువల నిర్మాణం జరిగింది. ప్రాజెక్ట్ కట్టేస్తే వెంటనే నీళ్లు వదలొచ్చు. చంద్రబాబు పోలవరం మీద దృష్టి పెట్టకుండా పట్టిసీమపై పట్టుబట్టాడు. ప్రతిపక్షాలు, మేధావులు, ఇరిగేషన్ నిపుణులు ఇది నిరర్ధక ప్రాజెక్ట్ అని చెబుతున్నా చంద్రబాబు వినలేదు. రాయలసీమకు నీళ్లిచ్చే పేరుతో పట్టిసీమను చేపట్టారు. దీని వెనుక ఎవరికి ఎలాంటి ప్రయోజనాలున్నాయనే దానిపై ప్రతిపక్షాలు తలోరకంగా మాట్లాడుతున్నాయి. గోదావరి నీళ్లను కృష్ణాడెల్టాకు తరలించి నదుల అనుసంధానం పూర్తి చేసామని చెప్పుకోవడానికి అధికార పార్టీ నాయకులు నానా హైరానా పడ్డారు. కాంట్రాక్టర్ల మీద ఒత్తిడి తెచ్చారు. పనులను తూతూ మంత్రంగా చేయించారు. ఏదో చేసామని చెప్పుకోవడానికి అదరా బదరా పనులు చేయించారు. పట్టిసీమ ఎత్తిపోతలకు కొత్త మోటార్లు అమర్చాల్సి వున్నా, మొక్కుబడిగా పని అయిపోయిందని చెప్పుకోవడం కోసం హంద్రీనీవా ప్రాజెక్ట్ వద్ద వున్న మోటార్‌ను తీసుకెళ్లి పట్టిసీమ ఎత్తిపోతలకు బిగించి ఆన్ చేసారు. ఈ మోటార్‌ను బిగించడానికి ఇంజనీర్లు నానా తంటాలు పడాల్సి వచ్చింది. నదుల అనుసంధానాన్ని పూర్తి చేసామని చెప్పుకోవడం కోసం పోలవరం కుడికాల్వ మిగతా భాగాన్ని కూడా హడావిడిగా తవ్వించారు. వై.యస్. హయాంలోనే ఈ కాలువ 80శాతం దాకా పూర్తి కావడం జరిగింది. మిగిలిన పనులు నాణ్యతను చూడకుండానే చేయించారు. ఒక మోటారు ఆన్ చేస్తే 350 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించాయి. ఈ ప్రవాహానికే పశ్చిమగోదావరి జిల్లా జానంపేట వద్ద పోలవరం కుడికాలువ అక్విడెక్ట్ బద్దలైంది. గోదావరి నీళ్లు కృష్ణలో కాకుండా కొల్లేరులో కలిసాయి. చంద్రన్న నదుల అనుసంధానం నవ్వులపాలైంది. హడావిడి పనుల వల్లే ఈ అనర్థం జరిగింది. అక్విడెక్ట్‌ను 12మీటర్ల లోతులో నుండి నిర్మించాల్సి వుండగా, అధికార నేతల తొందరపాటు వల్ల నాలుగుమీటర్ల లోతు నుండే నిర్మించాల్సి వచ్చిందని, కాబట్టి నీటి ప్రవాహాన్ని తట్టుకోలేక అవి తెగిపోయాయని నీటి పారుదల శాఖ ఇంజనీర్లే చెప్పారు.

దూరాలోచనతో చేసే పనులకు, దురాశ, దురాలోచనలతో చేసే పనులకు చాలా తేడాలుంటాయి. దూరాలోచనతో నెహ్రూ, వాజ్‌పేయి, ఇందిర, ఎన్టీఆర్, వైయస్ వంటి వాళ్లు చేసిన పనులు మనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దురాలోచనతో చేసే పనులు ఇలాగే పట్టిసీమ ఎత్తిపోతలలాగా ఎత్తిపోతుంటాయి. ఇలాంటి పనుల వల్ల నాయకులకు పోయేదేమీ వుండదు... వృధా అయ్యేదంతా ప్రజల సొమ్మే! అధికారపార్టీ వారి పబ్లిసిటీ ఆర్భాటం వల్ల గోదావరి, కృష్ణ అనుసంధానం కాస్తా గోదావరి-కొల్లేరుల అనుసంధానంగా మారింది.

# 28న శలాక రఘునాధశర్మ ఆధ్యాత్మిక ఉపన్యాసం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు ఆచార్యులు, ఆంధ్ర మహాభారతంపై పదివేల పేజీలకు మించిన ప్రింటెడ్ పేజీలున్న గ్రంథాలను వెలువరించిన మహా రచయిత బ్రహ్మశ్రీ డా. శలాక రఘునాధశర్మ ఈ నెల 28వ తేదీన నెల్లూరుకు విచ్చేస్తున్నారు. 28-29 తేదీల్లో నెల్లూరు టౌన్‌హాలులో జరిగే గజల్ (జిఎవిఎస్‌విఎల్) సేవా సంస్థ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. శ్రీ శలాక రఘునాధశర్మగారు ఆ రెండు రోజుల్లో సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో శ్రీ ఆదిశంకరాచార్య విరచిత 'సౌందర్య లహరి' అనే అంశంపై ఉపన్యసిస్తారని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గట్టుపల్లి జయచంద్ర, గట్టుపల్లి శశికళ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభ సభకు నెల్లూరులోని శ్రీ రామకృష్ణ సేవాసమితి స్థాపకులు, ప్రఖ్యాత కవి శ్రీ ఎస్‌వి నరసింహారావు (శారదా కుమార్) అధ్యక్షత వహిస్తారని వారు పేర్కొన్నారు. శ్రీ గట్టుపల్లి ఆదిశేషయ్య, శ్రీమతి సీతా మహాలక్ష్మమ్మ, శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీమతి లలితాంబగార్ల స్మృత్యంకంగా తమ సేవాసంస్థ (గజల్) ఏర్పడిందని వారు పేర్కొంటూ, పై కార్యక్రమాలకు భక్తులు, సారస్వతాభిలాషులు విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# ఎకె నగర్ పోస్టాఫీసులో ఆన్‌లైన్ సేవలు

నెల్లూరు దర్గామిట్ట ఎకె నగర్ సబ్ పోస్టాఫీసులో సోమవారం ఆన్‌లైన్ సేవలను పోస్టల్ నెల్లూరు డివిజన్ సూపరింటెండెంట్ విశ్వనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వున్న అన్ని సబ్ పోస్టాఫీసులను ఆన్‌లైన్ చేసే చర్యలు వేగవంతం అవుతున్నాయన్నారు. ఆన్‌లైన్ అయిన పోస్టాఫీసుల్లోని ఖాతాదారులు దేశంలో ఇతర చోట్ల ఆన్‌లైన్ అయిన పోస్టాఫీసుల్లో తమ ఖాతాలకు సంబంధించి సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, మురళీకృష్ణ, సబ్‌పోస్టుమాస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు గీతాంజలి విద్యార్థులు



చిత్తూరుజిల్లా మదనపల్లిలో 'మిట్స్' ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన జెయన్‌టియు అనంతపూర్ కబడ్డీ జట్టు ఎంపికలలో తమ విద్యార్థులు యు.దినేష్(సివిల్ 3వ సంవత్సరం), కె.వేణుగోపాల్(సివిల్ 4వ సంవత్సరం) ఎంపికైనట్లు గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ మరియు కరస్పాండెంట్ యన్.సుధాకర రెడ్డి సోమవారం నెల్లూరు హరనాథపురం కార్యాలయంలో పత్రికా విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. తమ విద్యార్థి యు.దినేష్ క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి, బెంగుళూరులో అక్టోబర్‌లో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు జెయన్‌టియు అనంతపూర్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారని, జెయన్‌టియు విశ్వవిద్యాలయానికి ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని, గీతాంజలి కళాశాల కేవలం సాంకేతిక విద్యాబోధనకే కాక, విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసి ప్రోత్సహించడానికి కూడా ప్రాధాన్యతనిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల మెకానికల్ విభాగం అధిపతి వెంకయ్య, పి.డి అశోక్, సివిల్ డిపార్ట్‌మెంట్ బ్రహ్మనాయుడు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# 'మెగా'వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

రావడం కాదు, చంద్రబాబు చేత ఇంకా ఎక్కువ తప్పులు చేయించాలన్న ఉద్దేశ్యమే. చంద్రబాబు ఎంత త్వరగా ప్రజాదరణ కోల్పోతే తమకు అంత మంచిదని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. తెలుగుదేశం బలహీన పడితేనే ఈ రాష్ట్రంలో బీజేపీ ఎదగడానికి అవకాశం ఉంటుంది. బీజేపీ చంద్రబాబు చేత మరిన్ని తప్పులు చేయించడమే పనిగా పెట్టుకుంది.

2019ఎన్నికల నాటికి రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదగాలన్నది బీజేపీ అధిష్ఠానం ఆలోచన. రాష్ట్రంలో కాంగ్రెస్ చచ్చుబడింది. పూర్తిగా చచ్చిపోయింది కూడా! బలంగా వుండేది తెలుగుదేశం, వైకాపాలే! ప్రతిపక్షంగా వైకాపా ఎలాగూ అలాగే వుంటుంది. ప్రజావ్యతిరేకత వచ్చేది అధికార టీడీపీ మీద. 2019 ఎన్నికలకు ముందే తెలుగుదేశాన్ని వదిలించుకునే విధంగా బీజేపీ ఆలోచన వుంది. రాష్ట్రంలో బలమైన సామాజికవర్గం కాపు. వైకాపాలో రెడ్లు, దేశంలో కమ్మ సామాజిక వర్గాల ప్రాబల్యం ఎక్కువ. కాపులను చేరదీసే విధంగా బీజేపీ కొత్త వ్యూహంలో వుంది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇప్పటికే బీజేపీ మద్దతుదారుడిగా వున్నారు. 2019 ఎన్నికల నాటికి ఆయనను తమ పార్టీలోకే తీసుకోవాలనేది బీజేపీ పెద్దల ఆలోచన. ఇక కాంగ్రెస్‌కు రాష్ట్రంలో మనుగడ లేదు. చిరంజీవికి ఆ పార్టీలో భవిష్యత్ లేదు. ఈ సమయంలోనే చిరును కూడా బీజేపీ లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేసే ఆలోచన వుంది. మెగా కుటుంబం బీజేపీలోకి వస్తే ఆ పార్టీకి బలం చేకూరుతుంది. పార్టీకి పునాది వుంది కాబట్టి చిరు, పవన్‌లు చేరితే ఆ బలాన్ని రెట్టింపు చేయడం పెద్ద సమస్య కాదు. 2019ఎన్నికలకు ఏడాది ముందే బీజేపీ నాయకులు మెగా కుటుంబంపై వల విసిరే అవకాశాలున్నాయి.

• విశాఖపట్నానికి

## ఆధ్యాత్మిక శోభ, రాజకీయ రాజసం, కళాత్మక కాంతి

# అన్నీ.. సుబ్బరామిరెడ్డితోనే!

### ఆయన జన్మదినం తెలుగుదనానికే పర్వదినం





***సెప్టెంబర్ 17 అంటేనే విశాఖ నగరవాసులకు ఓ పండుగరోజు. ఆరోజు జరగబోయే వేడుకల కోసం నగరవాసులంతా ఎదురు చూస్తుంటారు. ప్రతినిత్యం వచ్చే పెద్దపండుగ, వినాయకచవితి, దసరా, దీపావళిల లాగే సెప్టెంబర్ 17 సుబ్బరామిరెడ్డి పుట్టినరోజు కూడా వీరికి పండుగరోజే.***

***ఆధ్యాత్మిక రంగానికే శోభ తెచ్చినరోజు సుబ్బరామిరెడ్డి పుట్టినరోజు. రాజకీయ రంగానికి రాజసం వచ్చినరోజు టియస్ఆర్ పుట్టినరోజు, కళారంగానికి కాంతి తెచ్చిన రోజు కళాబంధు పుట్టినరోజు. ఈసారి విశాఖ నగరవాసులకు ఆ పండుగ రెండు రోజులొచ్చింది.***

సెప్టెంబర్ 17న వినాయకచవితి రావడంతో తన పుట్టినరోజును విశాఖవాసుల సౌకర్యార్థం సెప్టెంబర్ 19, 20తేదీలలో జరుపుకున్నాడు సుబ్బరామిరెడ్డి. దీంతో ఈసారి విశాఖ వాసులకు వరుసగా మూడురోజులు పండుగ వాతావరణం వచ్చేసింది. ఆయన పుట్టింది నెల్లూరే అయినా ఆయన బంధమంతా విశాఖతోనే. అనేకమంది ఆధ్యాత్మిక గురువులను, రాజకీయ ప్రముఖులను విశాఖకు రప్పించి తన సత్తా, పలుకుబడి చాటుకోవడంతో పాటు దైవత్వం పట్ల తనకున్న అపార నమ్మకాన్ని ఆయన ప్రదర్శించాడు. రాజకీయ ఆధ్యాత్మిక రంగాలతో సమానంగా కళా రంగాన్ని కూడా అంతే గౌరవించే సుబ్బరామిరెడ్డి ఈ యేడాది సీనియర్ సినీనటి, మాజీ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి జయప్రదని "నవరస కళాభినేత్రి' బిరుదుతో సత్కరించాడు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అటు సినీ రంగంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ దిగ్గజాలైన వారిని రప్పించి "సర్వధర్మ సమభావన సమ్మేళనాన్ని' నిర్వహించాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రాజకీయ నాయకులు, సినీ నటులు సుబ్బరామిరెడ్డి గురించి ప్రసంగిస్తూ ఆయన జన్మదినం తెలుగు దనానికే ఓ పర్వదినమని అభివర్ణించారు. తెలుగు కళారంగం చేసుకున్న పుణ్యఫలమే ఆయన తెలుగు గడ్డపై పుట్టాడని, తన కళాభిమానాన్ని భాషా బేధం లేకుండా బాలీవుడ్‌లో సైతం చూపిస్తున్న సుబ్బరామిరెడ్డి ధన్యుడని, ఆయన సేవలు అందుకుంటున్న కళామతల్లి ఎల్లప్పుడూ కళకళలాడుతుందని కీర్తించారు. అటు రాజకీయం, ఇటు ఆధ్యాత్మికంతో పాటు కళారంగానికి సైతం సరిసమాన ప్రాధాన్యతనిస్తూ మరోవైపు ప్రతిభావంతుడైన పారిశ్రామికవేత్తగా ఎదుగుతున్న నెల్లూరీయుల ముద్దుబిడ్డ, విశాఖవాసుల గారాలబిడ్డ సుబ్బరామిరెడ్డికి 'లాయర్' అభినందనలు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com